# మహానది

MAHANADI TELUGU DAILY

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 36 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | మంగళవారం | మే | 12 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


### సోమ్‌నాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని

## నెహ్రూ వ్యతిరేకించారు: మోదీ

**గాంధీనగర్,మే 11:** ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి దేశ తొలి ప్ర ధాని జవహర్‌లాల్ నెహ్రూ పై తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యా నంతరం గుజరాత్ లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టే శక్తులు దేశంలో ఇప్పటికీ ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమనాథ్ ఆలయ పునర్ని ర్మాణం జరిగి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహిం చిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్'లో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '1951లో సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ కేవలం ఒక సాధారణ విషయం కాదు. అది భారతదేశ స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీక' అన్నారు.



### 2017 తర్వాత తొలిసారిగా

## చైనా పర్యటనకు డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. మే 13 నుంచి 15 వరకు డోనాల్డ్ ట్రంప్ అమెరికాలో పర్యటించనున్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశ పర్యటనకు వెళ్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ... చైనాలో ట్రంప్ పర్యటనను అమెరికా–చైనా సంబంధాల భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన పర్యటనగా భావిస్తున్నారు. అయితే ఈ పర్యటన సందర్భంగా డోనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల మధ్య చర్చలు సాగనున్నాయి. ఈ ఇరువురు నేతల మధ్య ఆరు నెలల తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు జరగనున్నారు. వాణిజ్య వివాదాలు, వ్యూహాత్మక పోటీ, పశ్చిమ ఆసియా నుంచి ఇండో–పసిఫిక్ వరకు విస్తరిస్తున్న సంఘర్షణల కారణంగా దెబ్బతిన్న సంబంధాలను స్థిరీకరించడానికి అమెరికా, చైనాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ఇరుదేశాల మధ్య సంబంధాల భవిష్యత్తుపై చర్చించేందుకు ట్రంప్ పర్యటన ఉపయోగపడనుందని చెబుతున్నారు.



## బండి సంజయ్ కొడుకు భగీరథ్‌పై పోక్సో కేసు...

### డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి

## కీలక ఆదేశాలు

హైదరాబాద్ : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఓ మైనర్ బాలిక కుటుంబం ఫిర్యాదు ఆధారంగా బండి భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఈ కేసుపై తక్షణమే విచారణ ప్రారంభించాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మే 8వ తేదీన ఫిర్యాదు నమోదైనప్పటికీ, చర్యలు తీసుకోవడం జాప్యం చోటుచేసుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఈ కేసు విరాలను సీఎం రేవంత్ రెడ్డికి డీజీపీ సీవీ ఆనంద్ వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన దృష్ట్యా భద్రత ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉన్నారని తెలిపారు. అయితే ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని డీజీపీని సీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఓ బాలిక (17) కుటుంబం పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి... బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై ఫిర్యాదు చేసింది. తమ కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నారని ఆరోపించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్‌విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. మరోవైపు బాలికతోపాటు ఆమె తల్లిదండ్రులు డబ్బుల కోసం తనను బెదిరిస్తున్నారని బండి భగీరథ్ ప్రశ్నించారు. ఇక, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ వివాదంలో చిక్కుకున్నారు.



## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

**ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం**
**ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు**

న్యూఢిల్లీ, మే11 : కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు.



### అభివృద్ధికి కేంద్ర సహకారం

## తప్పనిసరి

**– మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్,మే11 : రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు,మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్‌ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్‌ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు.



## బండి భగీరథ్ కేసుపై స్పందించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

హైదరాబాద్ : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్ పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసు పైన తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి స్పందించారు. నగర పోలీస్ కమిషనర్ నుంచి వివరాలు తెప్పించుకుని విచారణ కోసం ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు. మరోవైపు బండి భగీరథ్ పై నమోదు చేసిన కేసుపై తక్షణమే విచారణ చేట్టాలని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. ఈ నెల 8 వ తేదీన ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను డీజీపీ సీవీ ఆనంద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు. కేసు సగ్రమ విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి డీజీపీని ఆదేశించారు.

### సీఎం విజయ్‌కి..

## జెడ్ ప్లస్ సెక్యూరిటీ



చెన్నై: తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ ప్లస్ సెక్యూరిటీ కేటాయించింది. 55 మంది కేంద్ర భద్రతా సిబ్బందితో 24 గంటల భద్రత ఏర్పాటు చేసింది. సీఎం భద్రతా బృందంలో 10 మందికి పైగా ఎన్ఎస్జీ కమాండోలు ఉన్నారు. సాధారణంగానే సీఎం అయ్యాక విజయ్ కి భద్రత కల్పించగా కేంద్రం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. తాజాగా మాజీ సీఎం ఎంకే స్టాలిన్ ను కలిసేందుకు ఆయన నివాసానికి చేరుకున్న విజయ్ జెడ్ ప్లస్ సెక్యూరిటీతోనే కనిపించారు. విజయ్ కి మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ స్వాగతం పలికి లోపలికి ఆహ్వానించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరవాత స్టాలిన్‌తో విజయ్ భేటీ అవ్వడం ఇదే మొదటిసారి కావడంతో ఇద్దరూ ఏ అంశాలపై చర్చిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల సమయంలో ఒకరిపై మరొకరు మాటల తూటాలతో దాడి చేసుకోగా ఇప్పుడు ఇద్దరూ కలవడం రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు వీరిద్దరి కలయిక రాజకీయాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని ప్రేరేపించేలా కనిపిస్తోంది.




## హైవే పై కారు బోల్తా..

### నలుగురికి గాయాలు

భిక్కనూరు : నిద్ర మబ్బు ఆవహించిందో ఏమో తెలియదు కాని అదుపుతప్పి కారు బోల్తా పడగా.. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడిన సంఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... నిర్మల్ నుంచి హైదరాబాద్ వెళుతున్న వేగనార్ కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు.

ప్రమాదం నుంచి బయటపడిన వారు ఒకసారి గా షాక్ కు గురై వివరాలు చెప్పలేక ఘటన నుంచి నుంచి తేరుకోలేకపోతున్నారు. దీంతో ఆ దారివైపు నుంచి వెళ్లే వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రమాదం జరిగిన విషయాన్ని గ్రామస్తులు ఫోన్ ద్వారా స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.



### పాలమూరు బైపాస్‌లో కారును ఢీకొన్న..

## స్పోర్ట్స్ బైక్

### ఐదుగురు మృతి

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిస్తా హౌస్ బైపాస్ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాలకొండ సమీపంలో స్పోర్ట్స్ బైక్, కారు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు, కారులోని ముగ్గురు దుర్మరణం చెందారు. ఓ కుటుంబం వివాహ వేడుకలో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కారులో మృతిచెందిన వారిని గౌసియా (30), అమీర్ (18 నెలలు), ఉజెఫా(8) గా గుర్తించారు. ఈ ప్రమాదంలో మరో మహిళ కూడా తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. స్పోర్ట్స్ బైక్ అతివేగంగా రావడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. బైక్ 100కిలోమీటర్లకు పైగా వేగంతోనే వచ్చి కారును ఢీకొట్టిందని పేర్కొంటున్నారు. కాగా, పాలమూరు బైపాస్ రోడ్డు రాత్రివేళలో బైక్ రేసింగ్‌లకు అడ్డాగా మారిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. "ప్రతి రోజు రాత్రి స్పోర్ట్స్ బైక్‌లతో యువకులు బైపాస్‌పై రేసింగ్‌లు చేస్తుంటారు. చెవులు పగిలేలా శబ్దాలు చేస్తూ ప్రాణాలతో ఆటలాడుతుంటారు. పోలీసులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు'' అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాత్రివేళల్లో ప్రత్యేక పెట్రోలింగ్, స్పీడ్ గన్స్, నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి బైక్ రేసింగ్‌లను పూర్తిగా అరికట్టాలని కోరుతున్నారు. లేదంటే మరిన్ని అమాయక కుటుంబాలు రోడ్లపై బలి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### విజయ్‌తో రాహుల్ గాంధీ..

## ఇన్‌స్టా రీల్ బ్లాక్..

### స్పందించిన కేంద్రం

న్యూఢిల్లీ: తమిళనాడు సీఎంగా విజయ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ స్టార్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అయితే ఇద్దరికి సంబంధించిన ఓ రీల్‌ను ఇన్‌స్టాగ్రామ్ లో అప్‌లోడ్ చేశారు. కానీ ఆ రీల్‌తో పాటు ఓ ఫోటోను కేంద్రం బ్లాక్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆ పోస్టును అడ్డుకున్నట్లు విమర్శించారు. అయితే కాంగ్రెస్ చేసిన ఆరోపణలను కేంద్రం కొట్టిపారేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో తలెత్తిన సమస్యతో తమకు సంబంధం లేదని ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ తెలిపింది. ఆ ప్లాట్‌ఫామ్ లో తలెత్తిన అంతర్గత సమస్య వల్ల.. పోస్టు ఫ్లాగింగ్ బ్లాక్ అయినట్లు ఆశాఖ వెల్లడించింది. ఆదివారం చెన్నైలో విజయ్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ ఈవెంట్‌కు రాహుల్ గాంధీ వెళ్లారు. ఇక తన సోషల్ మీడియా అకౌంట్ లో రాహుల్ అనేక ఫోటోలను షేర్ చేశారు. ఫ్లాగింగ్‌ను బ్లాక్ చేయడం పట్ల కాంగ్రెస్ నేత శ్రీవత్స తన ఎక్స్ అకౌంట్‌లో ఆరోపించారు. విజయ్‌తో కలిసి చేసిన రాహుల్ గాంధీ ఇన్‌స్టారీల్‌నుకేంద్రం బ్లాక్‌చేసిందనిఆరోపించారు. ఆ రీల్‌కు గంటలోనే సుమారు 12 మిలియన్ల వ్యూవ్స్ వచ్చాయని, ఇక వైరల్ ఫోటోను సుమారు 46 మిలియన్ల మంది లైక్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ అకౌంట్ ఎందుకు యాక్సిస్ కాలేదన్న విషయాన్ని మెటా కంపెనీ వెల్లడించలేదని, ఎలక్ట్రానిక్స్.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ రూల్ వల్ల ఆ సమస్య వచ్చిందని, రాహుల్ గాంధీ సోషల్ మీడియా అకౌంట్‌ను నొక్కిపెట్టారని, ఆయనకు చెందిన ఎక్స్, యూట్యూబ్ వ్యూస్, ఇన్‌స్టా ఫాలోవర్ల వివరాలను దాచి పెడుతున్నారని ఆరోపించారు. దేశ విపక్ష నేత గొంతును నొక్కేస్తున్నారని శ్రీవత్స ఆరోపించారు. రాహుల్ గాంధీ అకౌంట్లను దాచిపెడుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది.

## జర్నలిస్టులకు అక్రమంగా కేటాయించిన స్థలాలపై

# సమగ్ర విచారణ చేపట్టాలి

- అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి
- కొల్లూరులో అక్రమంగా పొందిన ఇంటి స్థలాలను రద్దు చేయాలి
- అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కల్పించండి
- అక్రెడిటేషన్ కమిటీలో అక్రమార్కులు ఉన్నారు
- లోకాయుక్త తీర్పు అమలు చేయండి
- సంగారెడ్డి కలెక్టర్ సిటిజన్ ఫోరం తెలంగాణ వినతి







**సంగారెడ్డి,మహానది న్యూస్,మే 11:** సంగారెడ్డి జిల్లా సహా పూర్వ మెదక్ జిల్లాలో 1990 నుంచి 2026 వరకు జర్నలిస్టులకు రెండుసార్లు అక్రమంగా ఇళ్ల స్థలాలు, భూములు కేటాయించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని "సిటిజన్ ఫోరం తెలంగాణ" జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు సిటిజన్ ఫోరం తెలంగాణ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల పేర్లతో పాటు వారి భార్యలు, తల్లులు, బంధువుల పేర్లపై కూడా అక్రమంగా ఇళ్ల స్థలాలు పొందినట్లు ఆరోపించారు. లోకాయుక్త 2009 డిసెంబర్ 29న ఇచ్చిన ఉత్తర్వులలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ చేసినట్లు పేర్కొంది. ముఖ్యంగా యునైటెడ్ మెదక్ జిల్లా పరిధిలో పనిచేసిన స్టాఫ్ రిపోర్టర్లు తమ కుటుంబ సభ్యుల పేర్లతో స్థలాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపింది. ఈ అక్రమాల్లో పాల్గొన్న జర్నలిస్టుల పై చర్యలు తీసుకోవాలని, వారి అక్రిడిటేషన్లు రద్దు చేయడంతో పాటు అక్రమంగా పొందిన స్థలాలను కూడా రద్దు చేయాలని అప్పట్లో లోకాయుక్త సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకొని కొందరు జర్నలిస్టులు సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరు గ్రామంలోని సర్వే నంబర్ 191/1లో మూడు ఎకరాల భూమిని జిల్లా జర్నలిస్టుల కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరుతో అక్రమంగా పొందినట్లు వారు ఆరోపించారు. అలాగే సర్వే నంబర్ 191/2లో మరో మూడు ఎకరాల భూమిని జిల్లా జర్నలిస్టుల మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరుతో పొందిన తర్వాత దానిని ప్లాట్లుగా మార్చి రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ సిటిజన్ ఫోరం డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జర్నలిజం పేరుతో కొందరు వ్యక్తులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిటిజన్ ఫోరం తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫోరం ప్రతినిధులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోకూడా జర్నలిస్టుల ముసుగులో కొందరు వ్యక్తులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అక్రమంగా ప్లాట్లు పొందిన వారిపై దర్యాప్తు నిర్వహించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఫోరం కోరింది. అలాగే, అర్హత ఉన్న పలువురు నిజమైన జర్నలిస్టులు ఇప్పటివరకు ఒక్క ప్లాటు కూడా పొందలేదని, వారికి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. నిజాయితీగా పనిచేస్తున్న జర్నలిస్టులకు న్యాయం జరిగేలా అర్హులైన వారికి గృహ స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం పై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫోరం కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు పల్లె అంజనేయులు కోరారు. ఈ వినతిపత్రానికి లోకాయుక్త ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ లేఖలు, రెవెన్యూ శాఖ పత్రాలు, సంగారెడ్డి తహసీల్దార్ నివేదికలు, కొల్లూరు గ్రామంలోని సర్వే నంబర్లకు సంబంధించిన భూ రికార్డులు తదితర పత్రాలను జత చేశారు.

# గ్రేటర్ జర్నలిస్టుల సొసైటీని గుర్తించండి

- మంత్రి పొంగులేటి కి సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి
- అర్హులైన జర్నలిస్టులందరికి న్యాయం చేస్తాం
- సొసైటీలన్నీ ఏకతాటిపైకి రావాలన్న మంత్రి





**హైదరాబాద్,మహానది న్యూస్, మే11:** జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయింపులో తమ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ని గుర్తించాలని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు వారు సోమవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సొసైటి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస స్థలాలు, గృహ వసతి కల్పించేందుకు 2008 లో తమ ఏర్పడిందని, ఈ సొసైటీలో గడిచిన17 సంవత్సరాలలో నాలుగు దఫాలుగా జర్నలిస్టుల సభ్యత్వ నమోదు చేయడం జరిగిందని, ప్రస్తుతం సొసైటీలో హైదరాబాద్ జిల్లాతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపాలిటీలలో వివిధ పత్రికలు, టీవీ చానళ్ళలో పని దాదాపు వెయ్యి మందికి పైగా జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ తమ సొసైటీని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదని, జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలతో ఏర్పాటు చేసే సమావేశాలకు సొసైటీని ఆహ్వానించకపోవడం, జేఏసీ లో తమను భాగస్వామ్యం చేయకపోడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజా ప్రభుత్వానికి మేము వ్యతిరేకం కాదని,తమ సొసైటీకి స్థలం ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని పలు మార్లు అడిగినప్పటికీ స్థలం ఇవ్వలేదని,సొసైటీ నిబంధన ప్రకారం స్థలం కేటాయిస్తే అందుకు ప్రభుత్వం నిర్ణయించిన నామినల్ ధర చెల్లించడానికి తాము సిద్ధంగా ఉన్నామని కూడా గత ప్రభుత్వానికి పలు మార్లు తెలియజేయడం జరిగిందని, అయినా అప్పటి ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనైనా తమ సొసైటీ సభ్యులైన జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించి న్యాయం చేయాలని వారు మంత్రిని కోరారు. అనంతరం మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డిని, ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డిని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నాయకులు రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్లస్థలాలిస్తాం..

- సొసైటీలన్ని ఏకం కావాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**తమ ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలు ఇవ్వడానికి చిత్తశుద్ధతో ప్రయత్నం చేస్తుందని, ఇందుకోసం జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలన్ని ఏకతాటిపైకి రావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ, అన్ని సొసైటీలు కలిసి జేఏసీగా ఏర్పడి అర్హులైన జర్నలిస్టుల జాబితాను తయారు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.**


# అసోంలో ఏనుగు పిల్లకు పుట్టినరోజు వేడుక

**ప్రియాన్ని అనే ఏనుగు కోసం బిపిన్ కశ్యప్ ప్రత్యేక ఏర్పాటు**

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన బర్త్‌డే వీడియో**

**కేక్, పండ్లతో ఘనంగా బర్త్‌డే సంబరాలు**

**జంతుప్రేమికుడిపై నెటిజన్ల ప్రశంసల వర్షం**



అసోం: జంతువులపై ప్రేమను చాటుకోవడంలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. కొందరు వాటికి ఆహారం పెడితే, మరికొందరు వాటిని కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. అసోంకు చెందిన బిపిన్ కశ్యప్ అనే జంతు ప్రేమికుడు ఒక అడుగు ముందుకేసి, తాను పెంచుకుంటున్న ఏనుగు పిల్ల పుట్టినరోజును ఘనంగా జరిపాడు. ప్రియాన్ని అలియాస్ మోమో అని పిలుచుకునే ఈ ఏనుగు పిల్ల బర్త్‌డే వేడుకకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బిపిన్ కశ్యప్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియోను పంచుకున్నారు. ఈ వీడియోలో ఆయన ఎంతో ఆనందంగా ప్రియాన్ని కోసం పుట్టినరోజు పాట పాడుతూ కనిపించారు. ఆ మూగజీవిపై ఆయన చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత నెటిజన్ల హృదయాలను కదిలించింది. ప్రియాన్ని కోసం ప్రత్యేకంగా పండ్లు, ధాన్యాలతో అలంకరించిన నీలి రంగు కేక్‌ను కూడా ఈ వీడియోలో చూడవచ్చు. పుట్టినరోజు మెనూలో భాగంగా అరటిపండ్లు, యాపిల్స్, ద్రాక్ష, కూరగాయలువంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని సిద్ధం చేశారు. బిపిన్, ప్రియాన్ని మధ్య ఉన్న బలమైన అనుబంధానికి ఈ వేడుక అద్దం పడుతోంది. ఈ వీడియోపై సోషల్ మీడియా యూజర్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఏనుగు పిల్ల క్యూట్‌నెస్‌కు చాలామంది ఫిదా అవుతున్నారు. ఒక యూజర్ స్పందిస్తూ, ‍::జంతువులను ప్రేమించే, వాటి పట్ల సానుభూతి చూపించే వారంటే నాకు చాలా ఇష్టం. మోమోకు పుట్టినరోజు శుభాకాంక్షలు:: అని కామెంట్ చేశాడు. ::ఇన్‌స్టాగ్రామ్‌లోనే అత్యంత అందమైన దృశ్యం ఇది:: అని మరో యూజర్ పేర్కొన్నాడు. ::ఈ జీవాలను ప్రేమిస్తున్నందుకు లవ్ యూ బ్రదర్. దేవుడు నిన్ను చల్లగా చూడాలి:: అని ఇంకొకరు రాశారు. పిల్ల ప్రియాన్నికి నా ప్రేమంతా.. తల్లి, పిల్ల ఇద్దరూ నిండు నూరేళ్లు జీవించాలి:: అని మరో నెటిజన్ ఆకాంక్షించాడు.

## తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా

# గద్వాల్ విజయలక్ష్మి




**హైదరాబాద్, మహానది న్యూస్, మే 11:** గ్రేటర్ హైదరాబాద్ పూర్వ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ని తెలంగాణ మహిళా కమిషన్ అధ్యక్షురాలిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐదేళ్ళ పాటు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు. ఆమె ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు కుమార్తె. మహిళా కమిషన్ సభ్యులుగా కాసోజు శంకరమ్మను ఎంపిక చేశారు. తెలంగాణ ఉద్యమంలో అశువులు బాసిన విద్యార్థి నాయకుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ. అలాగే చాకలి ఐలమ్మ ముని మనవరాలు చిట్యాల శ్వేత, శశికళా యాదవ్, సదా లక్ష్మి, ఎన్. రాధా బాయి, ఉస్మా ఆషా షకీరాలను సభ్యులుగా నియమించారు.

# ఇక పెద్దన్న పాత్ర ముగింపేనా..?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో విసిగిపోయిన ఐరోపా సమాఖ్య దేశాలు, అమెరికా నాయకత్వంలోని ప్రపంచ వ్యవస్థకు ముగింపు పలికి ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాయి. బలవంతుల చట్టానికి లొంగిపోకూడదని, బెదిరింపులకు బదులు గౌరవాన్ని కోరుకుంటున్నామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అన్నారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యూరప్ స్వాతంత్ర్యంపై ఏకాభిప్రాయం పెరిగిందని ఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ తెలిపారు. గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ వైఖరి నాటో కూటమికి చేటుగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిపై విసిగిపోయిన మిత్రదేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. అమెరికా నాయకత్వంలో నడిచే వ్యవస్థకు ముగింపు పలికినట్టు ప్రకటించాయి. యూరోపియన్ నాయకులు ఈ విషయంలో ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నారు. రెండోసారి ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేశారని, ఇకపై ప్రపంచం ఆయనకు భయపడి నడుచుకునే రోజులు పోయాయని వారు భావిస్తున్నారు.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మాట్లాడుతూ.. 'బలవంతుల చట్టానికి' ఐరోపా సమాఖ్య లొంగిపోకూడదని అన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా ఈయూ తన 'యాంటీ-కోఎర్షన్ ఇన్‌స్ట్రుమెంట్' (వ్యాపారపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొనే సాధనం)ను ఉపయోగించాల్సి వస్తుందనేది పిచ్చి ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. 'మేము ఎక్కువ వృద్ధిని, ప్రపంచంలో ఎక్కువ స్థిరత్వాన్ని కోరుకుంటున్నాం.. అంతేకాదు, బెదిరింపులకు బదులుగా గౌరవాన్ని కోరుకుంటాం. మేము క్రూరత్వానికి బదులుగా చట్టబద్ధతను కోరుకుంటాం' అని ట్రంప్ స్విట్జర్లాండ్‌కు చేరుకోవడానికి ముందు దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ వార్షిక సమావేశంలో మెక్రాన్ అన్నారు. గాజా శాంతి బోర్డులో చేరడానికి ఫ్రాన్స్ నిరాకరించడంతో వారిపై 200 శాతం టారీఫ్‌లు విధిస్తానని ట్రంప్ హెచ్చరించారుఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్, ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండా, ప్రపంచంలో వస్తున్న భారీ మార్పులకు ప్రతిస్పందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ మార్పుల వేగం, పరిమాణం యూరప్‌లో స్వాతంత్ర్యంపై ఏకాభిప్రాయాన్ని పెంచిందని ఆమె అన్నారు. 'నూతన స్వతంత్ర యూరప్‌ను నిర్మించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఇది సమయం' అని ఆమె తన ప్రసంగంలో తెలిపారు.బెల్జియం ప్రధాన మంత్రి బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ.. 27 సభ్య దేశాల ఐరోపా సమాఖ్య ఒక కూడలిలో ఉందని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా మద్దతు, ట్రంప్‌ను శాంతింపజేయడానికి ప్రయత్నించిన తర్వాత ఎదుర్కొన అతి దారుణమైన పరిస్థితి నుంచి ఎలా బయటపడాలో నిర్ణయించుకోవాలని అన్నారు. 'సంతోషకరమైన సేవకుడిగా ఉండటం ఒక విషయం. దుర్భరమైన బానిసగా ఉండటం మరొకటి' అని ట్రంప్ సుంకాల బెదిరింపుల గురించి డి వెవర్ వ్యాఖ్యానించారు.

# రాజ్యాంగ విజయాలు - వ్యవస్థ వైఫల్యాలు..!



భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం అనే ఆదర్శాలను దేశం మరోసారి గుర్తు చేసుకునే రోజు. కానీ దేశంలో ఏళ్ల తరబడి జైల్లో మగ్గి, చివరికి 'నిర్దోషి' అని తేలిన పౌరుడి కన్నీరు ఎవరు తుడుస్తున్నారు? 75 ఏళ్ల గణతంత్రంలో మన న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని కాపాడుతోంది గానీ, సాధారణ పౌరుడికి న్యాయం అందించడంలో ఎందుకు విఫలమవుతోంది? ఇదే నేడు మన ముందున్న కఠినమైన ప్రశ్న. రాజ్యాంగ రక్షకురాలిగా మన న్యాయవ్యవస్థ అనేక చారిత్రక తీర్పులిచ్చింది. మౌలిక హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా పేదలకు స్వరం×ఇవి గణతంత్ర విజయాలు. కానీ అదే సమయంలో, సమయానికి న్యాయం అనే మూలసూత్రం దగ్గర వ్యవస్థ పూర్తిగా కూలిపోతోంది. "న్యాయం" ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. కానీ, అట్టడుగున ఉన్న సామాన్యుడికి అది అందడానికి దశాబ్దాల కాలం పడుతోంది. ఆలస్యమైన న్యాయం.. అన్యాయంతో సమానం' అన్న నానుడి ప్రొఫెసర్ సాయిబాబా, సత్యంబాబు వంటి వారి జీవితాల్లో అక్షర సత్యమైంది. నేటికీ వారి ఉదంతాలు మన న్యాయ వ్యవస్థలోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తున్నాయి. వారు నిర్దోషులుగా విడుదలయ్యారు కానీ, వారు కోల్పోయిన కాలాన్ని, ఆరోగ్యాన్ని, కీర్తిని ఏ కోర్టు తిరిగి ఇవ్వగలదు?

ఉపా (చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం) వంటి చట్టాలు దేశ భద్రత కోసం ఉద్దేశించినవి, కానీ అవి రాజకీయ ప్రయోజనాల కోసం మారడం ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా ఉదంతం దీనికి పరాకాష్ట. 90శాతం వైకల్యంతో చక్రాల కుర్చీకే పరిమితమై, తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఉన్న ఒక మేధావిని పదేళ్లకు పైగా జైలులో ఉంచడం కేవలం న్యాయపరమైన తప్పు కాదు. అది మానవత్వంపై దాడి. సుప్రీంకోర్టు తీర్పుతో చివరకు విడుదల అయ్యారు. జైలులో ఆరోగ్యం క్షీణించి, విడుదలైన కొద్ది కాలానికే ఆయన మరణించడం మన విచారణ వ్యవస్థ చేసిన "నిశ్శబ్ద హత్య" కాదా? ఆ పదేళ్ల జైలు జీవితం ఎవరు తిరిగి ఇస్తారు? జైలులో క్షీణించిన ఆరోగ్యం, కోల్పోయిన బోధనా జీవితం..ఇది ''ప్రొసీజరల్ లాప్స్'' అంటూ ముగిసిపోవాల్సిన వ్యవహారమేనా !

నేడు న్యాయస్థానాల్లో సుమారు 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత వేగంతో వీటిని పరిష్కరించాలంటే 300 ఏళ్లు పడుతుందని అంచనా. ఇన్నేళ్ల పాలన తర్వాత కూడా 30 ఏళ్లకు పైగా నానుతున్న కేసులు 68 వేలకు పైగా ఉండటం మన వ్యవస్థకు సిగ్గుచేటు. గణాంకాల ప్రకారం, జైళ్లలో మగ్గుతున్న వారిలో 77 శాతం మంది విచారణ ఖైదీలే.

కళ్లముందే బాబ్రీ విధ్వంసం- కానీ కనిపించని నేరగాళ్లు!: 1992 డిసెంబర్ 6న దేశం మొత్తం ప్రత్యక్షంగా చూస్తుండగా జరిగిన బాబ్రీ మసీదు విధ్వంసం కేసులో 2019లో సుప్రీంకోర్టు "చట్టబద్ధ పాలనను ఉల్లంఘించిన దారుణమైన చర్య" అని అభివర్ణించింది. 2020లో సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పులో, ఈ కూల్చివేత ముందస్తు ప్రణాళికతో జరిగింది కాదని,

అది అప్పటికప్పుడు జరిగిన 'ఆవేశపూరిత చర్య' అని పేర్కొంటూ ఎల్.కె. అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి అగ్రనేతలతో సహా 32 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేసింది. వేల పేజీల విచారణ, వందలాది సాక్ష్యాలు, మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వచ్చిన ఫలితం.

# సంపాదకీయం

## పరస్పర విమర్శలతో ఒరిగేదేమిటి..?

తెలంగాణ రాజకీయాలు గమ్మత్తుగా సాగుతున్నాయి. కెసిఆర్ విమర్శలు, సిఎం రేవంత్ ప్రతి విమర్శలు జుగుప్సాకరంగా ఉన్నాయి. పరస్పర విమర్శలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రెండేళ్లు దాటినా కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతి విచారణలు, చర్యల్లో ఒక్క అడుగు కూడా పడలేదు. విచారణల పేరుతో కాలయాపన తప్ప మరోటి కానరావడం లేదు. ఏతావాతా రాజకీయ నాయకుల అవినీతిని పరస్పరం భరించే ఒప్పందాలు జరిగాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మొత్తానికి విభజన తరవాత తెలంగాణ దగా పడ్డదన్నది నిజం. అన్నింటికి మించి తెలంగాణ వ్యవహారాలను ప్రజలనుంచి దూరం చేసి మూడు పార్టీలు ఆటలాడుతు న్నాయి. కాంగ్రెస్ మీద బిఆర్ఎస్, బిఆర్ఎస్ మీద కాంగ్రెస్, ఈ రెండింటిపై బిజెపిలు విమర్శలు చేసుకోవడం పరిపటిగా మారింది. ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచన ఒక్కరికీ లేదు. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి, మళ్లీమళ్లీ అప్పులు చేస్తున్నారు. అవసరం లేని ఖర్చులనే ప్రస్తావిస్తున్నారు. రాజకీయంగా తామే బలంగా ఉండాలని, తామే పాలించాలన్న ఆలోచన తప్ప మరోటి కానరావడం లేదు. కెసిఆర్ హయాంలో జరిగిన అప్పుల గురించి కెసిఆర్ కూడా మాట్లాడడం లేదు. జరిగిన తప్పులు, అప్పులకు ఎవ్వరు కూడా బాధ్యత వహించడం లేదు. ఇదంతా ప్రజల ఖర్మకు వదిలేశారు. ఇకపోతే కెసిఆర్ తనయ ఇప్పుడు స్వతంత్రంగా రాజకీయాలు చేస్తున్నారు. బిఆర్ఎస్ బహిష్కరించాక ఆమెకు ఇప్పుడి ప్పుడే జ్ఞానోదయం అవుతోంది. పదేళ్ల పాలనా కాలంలో తాను నిమిత్త మాత్రురాలినని అంటున్నారు. అన్నింటికి మంచి ఆమె ఎక్కడికి వెళ్లినా సమస్యలు స్వాగతిస్తున్నాయి. ఆమె ఇవన్నీ చూసి ఆశ్చర్యంతో పాటు క్షమాపణలు చెబుతున్నారు. తనతండ్రి పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ అన్నది జరగలేదని, గుర్తిస్తున్నందుకు ప్రజలకు కూడా తెలిసి వస్తోంది. పదేళ్ల పాలనో కెసిఆర్ తెలంగాణను ఆగం చేశారని, దోపిడీ చేశారని, ఎక్కడా అభివృద్ధి జరగలేదని కవిత పర్యటనల ద్వారా నిత్యం తెలుసుకుంటున్నాం. ఆనాడు నాకు ఎలాంటి అధికారం లేదని, ఒక్క టీచర్‌ను కూడాబదిలీ చేయించుకునే అవకాశం రాలేదని వలపోస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆమె ఇప్పుడు ఒక సంచలన నాయకురాలిగా మారారు. అయితే ఆమె ఆరోపణలు, విమర్శలు తండ్రి పార్టీని మరింతగా దెబ్బతీస్తా యన్నది నిజం. అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతాయన్నది కూడా అంతే నిజం. కాళేశ్వరం నుంచి కూకట్‌పల్లి భూకబ్జాల దాకా తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆమె ఒక సంచలన నాయకురాలిగా మారి పోయారు. బిఆర్ఎస్‌లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల భూదందాలు, అక్రమాలపై విరుచుకు పడుతున్న తీరుతో ఆమె ప్రజల్లో మళ్లీ కొంత సానుభూతిని పొందే ప్రయత్నాల్లో సాగుతున్నారు. అయితే లిక్కర్ స్కామ్‌తో కవిత పొలిటికల్ కెరీర్‌కు కాస్త ఇబ్బంది ఏర్పడింది. అప్పటికే కేసీఆర్ పదేండ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఇలా ఎవరికి వారు స్వార్థ రాజకీయాలకు తెలంగాణను బలి తీసుకున్నారు. అందుకేనేమో ఇప్పుడు కవిత వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. మొదటి నుంచి కూడా పార్టీలో తనకు ప్రాధాన్యమిచ్చేవారు కాదని కవిత చెపుతోంది. ఎంపీగా ఉన్నపుడు తనను నిజామాబాద్‌కు మాత్రమే పరిమితం చేశారని చెపుతోంది. నేటి కాలంలో వారసత్వాలు లేని రాజకీయాలు నడవడం లేదు. కెసిఆర్ కూడా అందుకు అతీతుడు కాదని నిరూపించుకున్నారు. బీజేపీ, కమ్యూనిస్టులు మాత్రమే ఇందుకు భిన్నంగా ఉంటారు. కిందిస్థాయిలో ఆ పార్టీ నేతల వారసలు కూడా ఇప్పుడిప్పుడు మెల్లగా బయటకు వస్తున్నారు. భారతదేశంలో ఏ పార్టీ వారసత్వ రాజకీయాలకు అతీతం కాదు. కాకపోతే, ఒకే కుటుంబంలో కొడుకు, కూతురు, మేనల్లుడిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. తన బందు గణాన్ని కూడా తెచ్చి పెట్టుకున్నారు. తన కులం వారికి అగ్ర తాంబూలంఇచ్చారు. ఎక్కడెక్కడో ఉన్న వారిని ముందువరసలో పెట్టారు. ఇలా మొత్తం ఒకే కులం వారు గత పదేళ్లపాటు డామినేషన్ చేశారు. ఇప్పుడు అదే దెబ్బకొట్టింది. అదే అధికారాన్ని దూరం చేసింది. చివరకు కెసిఆర్‌కు వారసుల నుంచే సమస్యలు ఎదురవుతున్నాయి. కేసీఆర్ అడ్డదిడ్డంగా సంపాదించినర సంపదలో వాటా వివాదం కారణంగానే కవితను బయటకు పంపారని అంటున్నారు. సిఎం రేవంత్ రెడ్డి అయితే పదేపదే ఇదే చెబుతున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి తమ పార్టీవారే తనను కావాలని ఓడించారని ఇప్పుడు కవిత చెపుతోంది. మంచి వక్తగా పేరున్న కవిత బాగా సంపాదించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తనకేమీ తెలియదని ఇప్పుడు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆమెను దగ్గరగా చూసిన వారు మాత్రం నిజమేమిటో తెలుసుకోగలరు. లిక్కర్ కేసు ద్వారా ప్రతిష్ట దెబ్బతిన్నదన్నది నిజం. తిరిగి పరువు కాపాడుకోవాలనే ఆరాటం కవితలో బాగా కనిపిస్తోంది. అందుకే జాగృతి జనంబాట పట్టారు. రాజకీయాల్లో అపవాదుకు గురైనపుడు, కుటుంబం దూరం పెడుతున్నపుడు, తనకు మిగిలింది రాజకీయ మార్గమే అని కవిత భావించి ఉంటుంది. ఆమె చేపట్టిన తిరుగుబాటు రాజకీయం తండ్రి పార్టీని దెబ్తీస్తుందని తెలిసినా , తన రాజకీయ ఎజెండా కోసం ఆమె దేనినీ లెక్క చేయడం లేదని కనిపిస్తోంది. కాళేశ్వరంలో జరిగిన అవినీతికి హరీశ్‌రావే కారణంగా ఆమె చేసిన విమర్శలు సంచలనంగా మారాయి. ఎవ్వరినీ వదలకుండా అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. తాను మాత్రం కడిగిన ముత్యం అని చెప్పుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. కెసిఆర్ కూతురుగా రాజకీయాల్లోకి వచ్చిన కవిత ఇప్పుడు తనకుతానుగా రాజకీయంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె ఏమేరకు విజయం సాధిస్తారన్న చూడాలి. అయితే తెలంగాణ వేదికగా రాజకీయ పార్టీలు విన్యాసం చేస్తున్నాయి. తెలంగాణ విడివడ్డ తరవాత కూడా పెద్దగా ఆశించిన ప్రయోజనం మాత్రం నెరవేరలేదు. రాజకీయాలు వారి సౌలభ్యం కోసం మారాయి. ప్రజలు మాత్రం పావులుగా మారారు. ఈ తరహా రాజకీయాలను దూరం చేయాలంటే ప్రజలు చైతన్యం కావాలి. దగుల్బాజీ రాజకీయాలను దునుమాడాలి.

# పుట్టిల్లు మెట్టిల్లు రంగస్థలమే





కొత్త విద్యలు నేర్చుకుని కోట్లు సంపాదించాలని కోరుకునే కాలమిది. కుల వృత్తి కాకున్నా నాటకం వారి కుటుంబ వృత్తి. బువ్వ పెట్టని నాటకాన్ని వదిలి ఆ కుటుంబం హెూటల్ బిజినెస్‌లోకి మారిపోయింది. రంగు వెలిసిన నాటకాన్ని వదిలి తలో పని చూసుకుంటే.. ఆమె రంగస్థలాన్ని నమ్ముకుంది. నాటకాన్ని నిలబెట్టాలని ఇంకా ముఖానికి రంగేసుకుంటున్నది. సురభి వారసత్వాన్ని కొనసాగిస్తూ రాణి రుద్రమలా, సారలమ్మలా తెలంగాణ రంగస్థలంపై రణ నినాదం చేస్తున్నది వనారస హారిక! నాటక రంగంలో తనదైన శైలిలో రాణిస్తున్న హారిక అంతరంగం ఆమె మాటల్లోనే.. రంగస్థలం నా పుట్టినిల్లు.

సురభి కుటుంబంలో పుట్టాను. మా వాళ్లందరూ రంగస్థల కళాకారులే! మా నాన్న రేకంద మురళీకృష్ణ నటుడు. అంతేకాదు రంగస్థల తెరలపై అద్భుతమైన దృశ్యాలను చిత్రించేవాడు. మేకప్ ఆర్టిస్ట్ కూడా. అమ్మ రమాలక్ష్మి కూడా సురభి కుటుంబంలోనే పుట్టి పెరిగింది. మంచి నటి. ఇద్దరు నటుల గారాల పట్టిగా పెరుగుతూనే రంగస్థలంపైకి వచ్చాను. నాకు మూడేండ్లు ఉన్నప్పుడే బాల నాగమ్మ నాటకంలో చిన్నారి నాగమ్మగా నటించాను. ఆ సంగతి మా అమ్మ చెబితే తెలిసింది. చిన్నతనంలోనే చాలా నాటకాల్లో వేషాలు వేశానట.ఆ సంగతులు నాకు మాత్రం లీలగా గుర్తున్నాయంతే!

**అమ్మకు నేనే చెలికత్తె!:** చిన్న వయసులో డైలాగులు కంఠస్థం చేయడం కష్టంగా ఉండేది. 'మనకు చదువు, నాటకం.. రెండూ అవసరం' అని మావాళ్లు చెప్పేవాళ్లు. పిల్లలందరిలా చదువుకుంటూ నాటకాలు వేసేదాన్ని. హైదరాబాద్ (వనస్థలిపురం)లో వినాయక నాట్యమండలి పేరుతో మా వాళ్లు నాటకాలు వేసేవాళ్లు. అమ్మకు రంగస్థల నటిగా మంచి పేరుంది. వేరే నాటక సంస్థలు కూడా అవకాశాలు ఇచ్చేవి. ఓసారి అమ్మ 'ప్రహ్లాద' నృత్య రూపక ప్రదర్శన కోసం నన్నూ తీసుకెళ్లింది. అమ్మ రంభగా, నేను ఊర్వశిగా నృత్యం చేశాం. అప్పటికి నా పదో తరగతి పూర్తయింది. ఆ నృత్యరూపకం ప్రదర్శనతో రమాలక్ష్మి కూతురు డ్యాన్స్ బాగా వేస్తుందనే పేరొచ్చింది. ఈ విషయం విని.. మిర్యాలగూడలోని నాటక సమాజంలో నటించేందుకు డైరెక్టర్ రామచందర్ రావు గారు అవకాశం ఇచ్చారు. అలా 'ఉషా పరిణయం'లో అమ్మ ఉష పాత్ర పోషిస్తే నేను తనకు చెలికత్తెగా నటించాను.మా పెద్దనాన్న సురభి కొండలరావు గారు చిన్నప్పుడే నాకు సంగీతం, తాళ జ్ఞానం నేర్పించారు. వాయిస్ పెద్దగా రావడా నికి కారణం ఆయనే. మా అమ్మ శాస్త్రీయ నృత్యం నేర్చుకోలేదు. రంగస్థలానికి కావల్సిన మేరకు నేర్చుకుంది. తన దగ్గరే నేను డ్యాన్స్ నేర్చుకున్నా. పాత్ర పోషణ, డైలాగ్ డిక్షన్ అన్నీ అమ్మే చెప్పింది.

**మా ఆయనే నా హీరో:** మా బంధువులబ్బాయి (సురభి ఫ్యామిలీ లోని) కార్తీక్‌తో నాకు పెండ్లి జరిగింది. మా అత్తగారి కుటుంబ నేపథ్యం కూడా రంగస్థలమే. కార్తీక్, నేను చిన్నప్పుడు కలిసి నాటకాలు వేసేవాళ్లం. ఆయన హీరో అయితే, నేను హీరోయిన్ అన్నమాట. పాతాళ భైరవిలో నేను ఇందుమతినైతే.. మా ఆయన తోట రాముడు. శ్రీనివాస కల్యాణం, ఘంటసాల, కత్తి కాంతారావు, ఎంఎస్ సుబ్బలక్ష్మి నాటకాల్లోనూ మేమిద్దరం జోడీగా నాయకానాయికలుగా నటించాం, మెప్పించాం. అలా నా పుట్టినిల్లు, మెట్టినిల్లు రెండూ రంగస్థలమే అయింది. పెండ్లి తర్వాత మా పెద్దనాన్న వాళ్లు నడిపే 'సాయి సంతోషి నాట్య మండలి'లో నాటకాలు వేశాం. పిల్లలు కలిగిన తర్వాత నాలుగేండ్లపాటు రంగస్థలానికి దూరంగా ఉన్నాను.

**బతుకు మారలే:** కడుపునిండని కాలంలో మా వాళ్లు ముఖానికి రంగు వేసుకోవడం మానేశారు. రంగస్థలాన్ని వీడి హెూటల్ రంగంలోకి మారిపోయాం. తిరుపతిలో హెూటల్ పెట్టాం. కార్యస్థలం మారినా బతుకు మారలేదు. ఆ హెూటల్ పెద్దగా నడవలేదు. అక్కడి నుంచి పెద్ద పెండ్యాలకు వచ్చాం. అక్కడా పెద్దగా నడవలేదు. పల్లగుట్టకు వెళ్లాం. అక్కడా అంతే. ఈ హెూటల్ అందరి ఆకలి తీర్చడమే కానీ, మా ఆకలి తీర్చదని గుర్తించడానికి చాలాకాలమే పట్టింది. తరాలుగా వచ్చిన వృత్తి అన్నం పెట్టలేదు. కొత్త ఆశలతో పెట్టుకున్న వృత్తీ మా కడుపు నింపలేదు. దాంతో ఆ హెూటల్ మూసేశాం.

**ఆ తృప్తి చాలు:** మా మామగారు చనిపోయారు. మా ఆయన బతుకుదెరువు కోసం కంప్యూటర్ నేర్చుకున్నారు. డిజైనర్‌గా కొత్త కెరీర్ మొదలుపెట్టారు. ఆయన ఇల్లు నడుపుతున్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల ఆయన నటనకు పూర్తిగా దూరమయ్యారు. నాకు నటనంటే ఇష్టం. ఖాళీగా ఉండటం ఎందుకని మళ్లీ నాటకాల్లోకి వచ్చాను. ఖమ్మం, మిర్యాలగూడ, జడ్చర్ల, కర్నూలు, హైదరాబాద్‌లోని నాటక పరిషత్‌లు ప్రదర్శనకు పిలుస్తుంటాయి. వచ్చిన అవకాశాల్ని వదలుకోకుండా నటిస్తున్నాను. ఇందులో పెద్దగా ఆదాయం లేదు. కళాకారులకు ఆదాయం కన్నా.. ప్రేక్షకులను మెప్పించేలా పాత్ర పోషించామన్న తృప్తే ఎక్కువ విలువైనది.

# సం'పన్నుల' లేఖ



పెరుగుతున్న ఆర్థిక అసమానతల నేపథ్యంలో తమపై సంపద పన్ను మరింత విధించాలని కోరుతూ ప్రపంచ శత కోటీశ్వర్లు వివిధ దేశాల నేతలకు లేఖ రాయటం ఆసక్తికరమైన విషయం. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఈ లేఖను విడుదల చేయడం, దీనిపై 24 దేశాలకు చెందిన 400 మంది సంతకాలు పెట్టటం– పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యానికీ,అది అంతరాలనుపెంచుతుందనే ఒప్పుకోలుకూ సంకేతం. దోపిడీకి కూడా మానవీయ ముఖం తగిలిస్తేనే అది ఎంతోకొంత కాలం మనగలుగుతుందీ అన్న ముందస్తు జాగ్రత్తకు ఇదొక నిదర్శనం. సోవియట్ రష్యా కుప్పకూలిపోయాక – పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎదురే లేదని, అది తప్ప ప్రపంచ ప్రగతికి ఇంకే మార్గం లేదని నయా ఉదారవాదులు చేసిన వీరంగం ఇంతా అంతా కాదు. అయితే, ఆ ఊకదంపుడు వాదం నిజం కాదని రుజువవటానికి ఎంతో కాలం పట్టలేదు. గత ముప్పరు ఏళ్ల నుంచి ఎప్పటికప్పుడు పెట్టుబడి వైఫల్యం, ఉదార ఆర్థిక విధానాల డొల్లతనమూ రుజువవుతూనే ఉన్నాయి. ఒకపక్క భవంతులు ఆకాశాన్ని తాకుతున్నా, ఉత్పత్తులు గుట్టలుగా పేరుకుపోతున్నా, వ్యక్తిగత రుణాలూ, ఇఎంఐలతో ఊతంగా నిలిచామని అనుకున్నా– అవన్నీ అంతరాలను మరింత పెంచాయి తప్ప ప్రజల వాస్తవ అభివృద్ధికి తోడ్పడలేకపోతున్నాయి. విద్య, వైద్యం, ఇల్లు వంటి ప్రాథమిక అవసరాలను నెరవేర్చుకోవటానికే ప్రపంచ ప్రజానీకం నానా తంటాలూ పడాల్సి వస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ వెయ్యి పడగలెత్తి, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిగా స్వైరవిహారం చేస్తోంది. ఫలితంగా ప్రపంచంలోని 99 శాతం మంది కనీసావసరాల కోసం విలవిల్లాడుతుంటే – ఒక శాతంగా ఉన్న సంపన్నులు క్షణక్షణానికీ శత సహస్ర కోటీశ్వరులుగా పడగలెత్తుతున్నారు. గతేడాది నవంబర్లో జి20 దేశాల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా విడుదల చేసిన నివేదిక పెరుగుతున్న అంతరాల గురించి ఉద్ఘోషించింది. 90 శాతం మంది జనాభా నివసిస్తున్న 83 దేశాల్లో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని వెల్లడించింది. "గడిచిన ఇరవై ఏళ్లలో అనేక దేశాలు ప్రజావనరులను కోల్పోవడమే కాక, తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోయాయి. ఆ దేశాల మొత్తం సంపద 1980 నాటికి 40 ట్రిలియన్ డాలర్లు కాగా, 2024 నాటికి దాని విలువ 50 ట్రిలియన్ డాలర్లు మాత్రమే! అదే కాలంలో ప్రయివేటు సంపద 80 ట్రిలియన్ డాలర్ల నుంచి 500 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ దేశాలన్నింటా పెట్టుబడిదారులు సహస్ర కోటీశ్వరులుగా అవతరించారు." అని లెక్కలతో సహా వక్కాణించింది. దేశ ఉమ్మడి వనరుల మీద కోట్లాదిమంది శ్రమతో సృష్టించిన సంపద కొందరి దగ్గరే పోగుపడింది. దీంతో, పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకున్న అన్ని దేశాల్లోనూ ఆర్థిక సంక్షోభం ముదురుపాకాన పడుతోంది. నిరుద్యోగం, ఆదాయ క్షీణత అంతకంతకు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి.

మనదేశంలోనూ ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రంగా పెరిగిన వైనాన్ని అనేక నివేదికలు తేటతెల్లం చేశాయి. దేశంలోని 40 శాతం సంపద ఒక శాతంగా ఉన్న అంబానీ, అదాని వంటి కుబేరుల వద్ద పోగుపడింది. గత పాతికేళ్లలో దేశంలో సృష్టించిన సంపదలోని 62 శాతం వారి వద్దకే చేరింది. అట్టడుగున ఉన్న 50 శాతం సామాన్య ప్రజలతో పోలిస్తే– వారి సంపద ఆరున్నర రెట్లు ఎగబాకింది. మోడీ ప్రభుత్వం తలసరి ఆదాయ లెక్కలతోనూ, జిడిపి గణాంకాలతోనూ బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నా– వాస్తవ పరిస్థితి ఏమిటో ప్రజల జీవన సరళిలో కళ్లకు కడుతోంది. ఆర్థిక అంతరాలు తీవ్రంగా పెరిగినప్పుడు, వాటి కష్టనష్టాలు జీవితంలో ప్రతిఫలిస్తున్నప్పుడు ప్రజలు చూస్తూ ఊరుకోరు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఇప్పటికే ఆందోళనలు తీవ్రతరమవుతున్నాయి. వాటి నుంచి దారి మళ్లించటానికి పాలకులు మతోన్మాదం, జాతోన్మాదం, ఉద్వేగాలూ, ఉద్రేకాలూ తాత్కాలికంగా ప్రజలను మభ్యపెట్టినా ఎల్లకాలమూ అది సాగదు. ఆ సాగని రోజు సంభవించినప్పుడు ఉత్పన్నమయ్యే పరిణామాలు ఎలా ఉంటాయో పెట్టుబడిదారులకు తెలుసు. కాబట్టే అంతరాలను తగ్గించటం గురించి ముందస్తు జాగ్రత్తగా మాట్లాడ్డం మొదలెట్టారు. సంపన్నులపై పన్ను పెంచటం గురించి మనదేశంలోనూ చాలాకాలంగా చర్చ సాగుతోంది. రుణాల మాఫీ, ఉచితంగా భూపందేరం, రాయితీల కల్పన వంటి చర్యలతో కార్పొరేట్ల సేవ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా ప్రజల పక్షం ఆలోచించాలి. శత కోటీశ్వరులపై అవసరమైనంత పన్ను విధించి, సామాన్యుల శ్రేయస్సుకు వినియోగించాలి.

# పేదరిక నిర్మూలనపై దొంగ లెక్కలు !

భారతదేశంలో పేదరిక నిర్మూలన అన్నది కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది. పేదలు ఉంటేనే రాజకీయ నాయకుల మనుగడ సాధ్యం అవుతుంది. పేల పేరుతో దుబారా చేయడం సులువవుతుంది. అనేక పథకాలను ప్రకటిచడం, డబ్బులను దుబారా చేయడం, ఓట్లను దండుకోవడం అన్న ప్రక్రియ నిరంతరంగా సాగాలి. అందుకే పేదల పేరుతో నిత్యం ఏదో ఓ కార్యక్రమం సాగుతూనే ఉంటుంది. ఇటీవల ఉపాధి హామీ పథకం పేరు మారింది. దీంతో అన్నిపార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. మహాత్మాగాంధీ పేరు తొలగిండంపై ఆందోళనలకు దిగాయి. లెఫ్ట్ పార్టీలు కూడా ఇందులో పాలుపంచుకోవడం దారుణం. పేరులో ఏముందున్న జ్ఞానం లేకుండా గగ్గోలు పెడుతున్నారు. ఉపాధిహామీతో అసలు కూలీలకు కరువు వచ్చింది. ప్రభుత్వ ధనం వృధా అవుతోంది. వ్యవసాయ పనులు జరగడం లేదన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఈ పథకం కింద గ్రామస్థాయిలో నిర్మాణాత్మక పనులేవీ ఇప్పటి వరకు జరగలేదు. కేవలం మట్టి ఎత్తిపోయడం తప్ప. దీనికోసం వేలకోట్లు తగలేశారు. ఇకపోతే కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశామని, కోట్ల మందికి ఇళ్లు కట్టించామని కేంద్రం చెబుతోంది. ఇంత జరిగితే పేదరికం లేకుండా పోవాలి. అలాంటప్పుడు ఉచిత బియ్యం, ఉచిత ఇల్లు, ఉచిత కరెంట్, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అసవరం లేదు. ఓ వపు పేదరిక నిర్మాలన జరిగిందని చెబుతూనే..మరోవైపు పేదల పేరుతో పథకాల దందా సాగుతోంది. ఇది పాలకుల ద్వంద్వ విధానాలకు నిదర్శనం. పేదలు ఉంటేనే ఓట్లు రాలుతాయని వారికి తెలుసు. భారత్‌లో పేదలు జనాభాలో 5.25 శాతం మాత్రమే ఉన్నారంటూ ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. తలసరి రోజు ఖర్చు రూ.62గా నిర్ధారించి అంతకన్నా తక్కువ ఆదాయం వస్తున్నవారు 5.25 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. ఇక నీతి ఆయోగ్ 2022–23 నాటికి దేశంలో 5 శాతం మాత్రమే నిరుపేదలు ఉన్నట్టు ప్రకటించింది. గ్రామాల్లో రూ.57, పట్టణాల్లో రూ.69 చొప్పున రోజుకు తలసరి ఆదాయం గనుక వస్తే వారంతా నిరుపేదలు కానట్టే లెక్కించింది. పేదరిక స్థాయి నిర్ధారించేటప్పుడు ఆ సొమ్ముతో రోజువారీ ఆహారపు అవసరాలతోబాటు వైద్యానికి, దుస్తులు వగైరాలకు, రవాణాకు, అద్దెకు కూడా చెల్లించగలిగేలా ఉండాలి. ఇప్పుడు నిర్ణయించిన స్థాయిలో బతకాలంటే వాళ్ళు ఇల్లూ వాకిలీ లేని బిచ్చగాళ్ళుగా మాత్రమే మిగులుతారు. ఈ లెక్కన చూస్తే మరో ఏడాది నాటికి ఇండియాలో నిరుపేదలు అనేవారే లేరంటూ ప్రభుత్వం ప్రకటించవచ్చు. పెరుగుతున్న విద్య, వైద్యపు ఖర్చులతో కోట్లాదిమంది అదనంగా పేదరికంలోకి అనునిత్యమూ దిగజారిపోతూ వుంటే, కనీస పౌష్టికాహార లోపం వారిని జీవచ్ఛవాలుగా చేస్తూ వుంటే, మరోపక్క ప్రపంచబ్యాంక్ తన తప్పుడు లెక్కలతో నిరుపేదలు తగ్గిపోయారంటూ ప్రకటిస్తూ వారిని అవహేళన చేస్తూనే వుంది. ఎందుకంటే ఇంత తక్కువ స్థాయిలో బతకలేక ఆ నిరుపేదలంతా అప్పటికి చచ్చివూరుకుంటారు. కనీస పౌష్టికాహార స్థాయిని బట్టి పేదరికపు స్థాయిని గనుక నిర్ణయిస్తే అది ప్రభుత్వం నిర్ణయించినదానికి మూడు రెట్లయినా ఉంటుంది. ఆ స్థాయికి దిగువన ఇప్పుడు 65 శాతం ప్రజలు పడిపోయారు. నజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరల దాడి వల్ల ఉన్నవారు కూడా పేదలుగా మారే ప్రమాదం ఏర్పడింది. దీనిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదు. ప్రపంచ బ్యాంక్ లెక్కలు ఎందుకు పనికిరానివిగా గుర్తించాలి. పేదరిక నిర్మూలన అంటే కూడు,గూడు, గుడ్డ ఉంటేనే చాలదు. బతకడానికి పని ఉండాలి. పనిచేసుకుంటే కుటుంబాన్ని పోషించుకోగలగాలి. ఇవేవీ లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులను కల్పించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కూడా లేవు. పేదరికం నుంచి బైట పడడానికి నిర్దిష్టమైన చర్యలను తీసుకోవడం మొదలుపెట్టాలి. దుర్భర దారిద్ర్యంలో బతుకుతున్నవారిని గుర్తించి వారికి తగు విధంగా పునరావాసానికి సహాయం అందించడంలో ముందుకు సాగాలి. కుటుంబాలను గుర్తించేందుకు గ్రామాల వారీగా లెక్కలు తీయాలిచ ప్రపంచబ్యాంక్ మాత్రం ఇటువంటిదేమీ చేయడం లేదు. నిరుపేదరికపు స్థాయిని అమెరికన్ డాలర్లలో రోజుకు 3 డాలర్లుగా నిర్ధారించింది.

# నల్ల జీలకర్రలో అనేక లాభాలు..!



జీలకర్రను మనం ఎప్పటి నుంచో వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నాం. జీలకర్రను నిత్యం అనేక వంటల్లో వేస్తుంటారు. జీలకర్రను కూరల్లో వేస్తే కూరలు చక్కని వాసన వస్తాయి. రుచిగా కూడా ఉంటాయి. అయితే జీలకర్రలో మరో రకం జీలకర్ర కూడా ఉంటుంది. అదే నల్ల జీలకర్ర. దీన్ని చాలా మంది చూసి ఉండరు. కానీ నల్ల జీలకర్రను కూడా మనం ఉపయోగించవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. నల్ల జీలకర్రను ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుండాలి. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. నల్ల జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వీటిల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

కీళ్ల నొప్పులు, వాపులకు..: నల్ల జీలకర్రలో అధికంగా ఉండే థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఈ జీలకర్రను వేసి మరిగించిన నీళ్లను రోజూ సేవిస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నల్ల జీలకర్రలో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. అంటే దీన్ని తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. నల్ల జీలకర్రలో ఉండే సమ్మేళనాలు ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలను తగ్గించేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. నల్ల జీలకర్రను తీసుకుంటే అలర్జీలను సైతం తగ్గించుకోవచ్చు. శ్వాస నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి గాలి సరిగ్గా లభిస్తుంది. ఊపిరి సరిగ్గా పీల్చుకుంటారు.

షుగర్ ఉన్నవారికి..: అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్ర ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి నల్ల జీలకర్ర ఎంతగానో మేలు చేస్తుంది. డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవచ్చు. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్రను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతోపాటు ట్రై గ్లిజరైడ్స్ కూడా తగ్గుతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

క్యాన్సర్ కణాలకు ఔషధం..: నల్ల జీలకర్రలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. దీంతో క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. సైంటిస్టులు జంతువులపై చేసిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. నల్ల జీలకర్ర నుంచి తీసిన నూనె కూడా మనకు లభిస్తుంది. దీన్ని వాడడం వల్ల అనేక చర్మ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా మొటిమలు, గజ్జి, తామర, దురద, సోరియాసిస్ వంటి సమస్యలకు ఈ నూనెచక్కగా పనిచేస్తుంది. గాయాలు,పుండ్లను త్వరగా మానేలా కూడా చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్ర నూనె జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తుంది. శిరోజాలకు దీన్ని రాస్తుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి. ఇలా నల్ల జీలకర్రను వాడితే అనేక లాభాలను పొందవచ్చు.

# గుండెపోటుకు చెక్ పెట్టే ఈ ఫుడ్ ఐటమ్స్ గురించి మీకు తెలుసా..?



ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్నాపెద్దా, ఆడామగ తేడా లేకుండా గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయి. నిత్యం కసరత్తులు చేసి ఫిట్‌గా ఉండే క్రీడాకారులు, ఎలాంటి గుండె జబ్బుల ఆనవాళ్లు లేని ఆరోగ్యవంతులు కూడా అకస్మాత్తుగా వచ్చే హార్ట్ ఎటాక్‌లతో, కార్డియక్ అరెస్ట్‌లతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ఆకస్మిక గుండె రుగ్మతలకు చెక్‌పెట్టేందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమమైన ఆహార పదార్థాలు చేపలు, గుడ్లు. ఈ రెండింటిలోనూ ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మీరు శాఖాహారులైతే చేపలు, గుడ్లకు బదులుగా డ్రై ఫ్రూట్స్ తినవచ్చు. డ్రై ఫ్రూట్స్‌లో కూడా ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులను నివారిస్తాయి. పప్పుధాన్యాలు, బీన్స్‌ను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి శరీరానికి పుష్కలంగా ప్రోటీన్‌ను అందించడంతోపాటు గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడుతాయి. అదేవిధంగా సిట్రస్ జాతి పండ్లలో కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక పోషకాలు ఉంటాయి. సిట్రస్ పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దాంతో ఆకస్మిక గుండెపోట్లు, కార్డియాక్ అరెస్ట్‌ల వంటివి జరగకుండా ఉంటాయి.

# కాలానికి తగ్గట్టే..

ఆహార అలవాట్లను కూడా.. కాలానికి తగ్గట్టుగా మార్చుకోవాలి. ఇష్టమైన వంటకమైనా.. సీజన్‌కు సెట్‌కాకుంటే పక్కన పెట్టేయాలి. లేదంటే, ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ముఖ్యంగా, వేసవిలో కొన్ని కూరగాయలతో అనారోగ్యం పొంచి ఉంటుంది. కాబట్టి, ఎండకాలంలో ఏయే కూరగాయలు, వంటకాలు తినకూడదో తెలుసుకుంటే మంచిది. వంకాయ.. కూరగాయల్లో రారాజుగా పేరు. కానీ, వేసవిలో మాత్రం ఆరోగ్యానికి శత్రువు. వంకాయను వేడి కూరగాయగా చెబుతారు నిపుణులు. వేసవిలో దీన్ని తినడం వల్ల జీర్ణవ్యవస్థను బలహీనపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్ వంటి పొట్ట సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొందరిలో అలెర్జీలు కూడా రావొచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలుచేసే కాలీఫ్లవర్.. ఎండల్లో శరీరానికి హాని కలిగిస్తుంది. ఇందులో అధిక మొత్తంలో సల్ఫర్ ఉంటుంది. ఇది శరీరంలో వేడిని పెంచుతుంది. ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలకూ దారితీస్తుంది.

మూత్రపిండాల సమస్యలు, రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా ఉన్నవారు వేసవిలో చేమదుంపలను తినకూడదని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఆగ్జాలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది మూత్రపిండాల పని తీరుపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, వేసవిలో డీహైడ్రేషన్ వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. అలాంటి కాలంలో చేమదుంపలు తింటే.. కిడ్నీలకు మరింత హాని కలుగుతుంది. మాంసం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో, జీర్ణవ్యవస్థపై అధిక ఒత్తిడి పడుతుంది. ఇక



శరీరం వేడిగా ఉండే వేసవిలో మటన్ వంటకాలు తింటే.. శరీర ఉష్ణోగ్రత మరింతగా పెరుగుతుంది. కాబట్టి, వేసవిలో మాంసాహారాన్ని తగ్గించుకోవడం మంచిది. ఇక వేడివేడి కాఫీలు, టీలను కూడా తగ్గించాలి. ఇవి శరీర ఉష్ణోగ్రతను అమాంతం పెంచేసి, మరింత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. వీటికి బదులుగా

మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లను ఎంచుకుంటే బెటర్! వేసవి అంటేనే.. పచ్చళ్ల సీజన్. ముఖ్యంగా ప్రతి ఇంట్లోనూ మామిడికాయలతో పచ్చళ్లు పెట్టుకుంటారు. కానీ, ఈ కాలంలో వీటికి దూరంగా ఉండటమే మంచిది. పచ్చళ్లలో ఉప్పు, నూనె అధికంగా వాడతారు. ఉప్పు అధికంగా తీసుకుంటే.. శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. ఇది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఇక, అధిక నూనె కూడా వేసవిలో అనారోగ్యానికి కారణమవుతుంది.

# నిమ్మ ఆకులను ఎలా ఉపయోగించాలంటే..

## ఈ ఇంటి చిట్కాలను పాటించండి..!



నిమ్మకాయల వల్ల మనకు ఎన్ని అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. నిమ్మరసాన్ని చాలా మంది వేసవిలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీని వల్ల శరీరంలో ఉన్న వేడి తగ్గుతుంది. నిమ్మకాయల్లోని రసంలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా వ్యాధులను దరి చేరకుండా చేస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. అయితే నిమ్మకాయలు మాత్రమే కాదు, నిమ్మ చెట్టు ఆకులు కూడా మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. నిమ్మ ఆకులను ఉపయోగించి అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. నిమ్మ ఆకుల్లో సిట్రిక్ యాసిడ్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవన్నీ మనకు రోగాలు రాకుండా చూస్తాయి. ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి.

నిద్రలేమి సమస్యకు..: నిమ్మ ఆకులను కొన్ని తీసుకుని కొద్దిగా నలిపి నీటిలో వేసి మరిగించాలి. 10 నిమిషాలు మరిగాక స్టవ్‌ను ఆఫ్ చేసి నీళ్లను వడకట్టి ఆ నీళ్లు గోరు వెచ్చగా ఉండగానే కొద్దిగా తేనె కలిపి తాగేయాలి. ఈ నీళ్లను తాగుతుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుం ది. రాత్రి పూట ఈ నీళ్లను తాగితే మనస్సుకు విశ్రాంతి కలిగి నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఈ నీళ్లను సేవించడం వల్ల జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. అసిడిటీ సమస్య ఉన్నవారు మాత్రం ఈ నీళ్లను సేవించకూడదు. నిమ్మ ఆకులను కొన్ని తీసుకుని కొద్దిగా నలిపి చర్మం కనిపించే ప్రాంతాల్లో రాయాలి. దీంతో దోమలు దూరంగా పోతాయి. అలాగే ఇంట్లో కిటికీలు, తలుపులు, ఇతర ప్రదేశాల్లో నిమ్మ ఆకులను నలిపి చిన్నపాటి గిన్నెలో ఉంచితే ఈగలు, పురుగులు, బొద్దింకలు రాకుండా అడ్డుకోవచ్చు.

చర్మ సంరక్షణకు..: నిమ్మ ఆకులను కొద్దిగా నలిపి నీటిలో వేసి బాగా కలిపి ఆ నీళ్లతో స్నానం చేయాలి. దీంతో చెమట వాసన రాదు. దుర్వాసన రాకుండా అడ్డుకోవచ్చు. శరీరం చక్కని వాసనను అందిస్తుంది. ఇది మనస్సును కూడా రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. అలాగే చర్మం సంరక్షించబడుతుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోయి కాంతివంతంగా మారుతుంది. చర్మం మెరుస్తుంది. సహజసిద్ధమైన నిగారింపును పొందుతుంది. కొన్ని నిమ్మ ఆకులను నీటిలో వేసిమరిగించాలి. ఆ నీళ్లను సగం బకెట్ గోరు వెచ్చని నీటిలో పోసి కలపాలి. అనంతరం ఆ బకెట్‌లో పాదాలను మునిగేలా 15 నిమిషాల పాటుఉంచాలి. ఇలాచేస్తుంటే పాదాలకండరాలకు ప్రశాంత త లభిస్తుంది. పాదాలు, కాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

సహజసిద్ధమైన రిఫ్రెషనర్‌గా..: నిమ్మ ఆకులను సహజసిద్ధమైన రిఫ్రెషనర్‌గా కూడా ఉపయోగించవచ్చు. నిమ్మ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను సేకరించి ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉపయోగించాలి. ఇంట్లో దుర్వాసన వస్తున్న చోట్లలో ఈ నీళ్లను స్ప్రే చేయాలి. దీంతో వాసన పోతుంది. రూమ్ అంతా పరిమళంతో నిండిపోతుంది. నిమ్మ ఆకులను బాగా నూరి మెత్తని పేస్టులా చేసి అందులో కాస్త తేనె, పెరుగు వేసి కలిపి ఫేస్ ప్యాక్‌లా తయారు చేయాలి. దీన్ని ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖంపై ఉండే మృత చర్మ కణాలు తొలగిపోతాయి. ముఖంపైఉండే ముడతలు, మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. ముఖం మృదువుగా మారుతుంది. చర్మంపై అలర్జీలు వచ్చే వారు ముందుగా ప్యాచ్ టెస్ట్ చేసి ఈ చిట్కాను ఉపయోగించాలి. నిమ్మ ఆకులను పేస్ట్‌లా చేసి అందులో పెరుగు కలిపి జుట్టుకు పట్టించి కాసేపు అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా చేస్తుంటే చుండ్రు పోతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. ఇలా నిమ్మ ఆకులతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# కాఫీకీ ఓ టైముంది

కాఫీ తాగడం.. ఆరోగ్యానికి మంచిదే! కానీ, ఎప్పుడు తాగుతున్నాం? ఎంత తాగుతున్నాం? అనేది కూడా ముఖ్యమని అంటున్నారు అమెరికా పరిశోధకులు. గుండె, శరీరం మీద కెఫీన్, కాఫీ తాగే సమయం చూపించే ప్రభావాలపై ఓ పరిశోధన జరిగింది. అమెరికా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సంస్థ.. దాదాపు పదేండ్లపాటు ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో పాల్గొన్నవారు రోజుకు కనీసం ఒక్కసారైనా తీసుకునే ఆహారం, పానీయాలను క్షుణ్ణంగా పరిశీలించింది. సర్వే సమయంలో సంభవించిన మరణాలను, వాటి కారణాలను నమోదు చేసింది. ఆయా డేటాలను విశ్లేషించి.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. వీరిలో 52 శాతం మందికి కాఫీ తాగే అలవాటు ఉంది. అందులోనూ 36 శాతం మంది ఉదయం మాత్రమే కాఫీ తాగుతుండగా.. మిగిలిన 16 శాతం మంది రోజులో అనేకసార్లు కాఫీ తాగుతారని చెప్పారు. అయితే, కాఫీ తాగనివారితో పోలిస్తే.. ఉదయంపూట కాఫీ తాగేవారికి ఏ కారణంతోనైనా మరణం సంభవించే ముప్పు 16 శాతం, గుండెజబ్బుతో మరణించే ముప్పు 31 శాతం తక్కువగా ఉంటున్నట్టు తేలింది. అయితే, రోజంతా రెండుమూడు సార్లు కాఫీ తాగేవారిలో ఇలాంటి ప్రయోజనాలేవీ కనిపించలేదని పరిశోధకులు వెల్లడించారు. మధ్యాహ్నం, సాయంత్రం కాఫీ తాగేవారిలో జీవ



గడియారం క్రమం తప్పుతుందనీ, మెలటోనిన్ వంటి హార్మోన్ల మోతాదులు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఫలితంగా ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి.. రక్తపోటు, గుండెజబ్బు ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.



# బత్తాయి పండ్లను లైట్ తీసుకోకండి..

## ఇవి మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు..

బత్తాయి పండ్లు.. చూసేందుకు అచ్చం నారింజ పండ్లలాగే ఉంటాయి. కానీ నారింజ పండ్లంత తియ్యగా ఉండవు. మరీ పుల్లగా కూడా ఉండవు. కానీ ఇవి రుచిగా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. చాలా మంది రహదారుల పక్కన ఉండే జ్యూస్ సెంటర్లలో బత్తాయి రసం తాగేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ పండ్లు కాస్త తీపి, పులుపు రుచి కలిగి ఉంటాయి. చూసేందుకు పెద్ద నిమ్మ పండు సైజులో ఉంటాయి. బత్తాయి పండ్లనే స్వీట్ లైమ్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్ల గుజ్జు లేత పసుపు రంగులో ఉంటుంది. బత్తాయి పండ్లను చాలా మంది నేరుగా తింటారు. కానీ ఈ పండ్లను జ్యూస్‌గా తాగితేనే చాలా బాగుంటుంది. బత్తాయి పండ్ల రసాన్ని చాలా మంది ఇష్టంగా తాగుతారు. బత్తాయి పండ్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగుతున్నా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

నోటి దుర్వాసనకు చెక్..: బత్తాయి పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. జలుబు, జ్వరం వచ్చినప్పుడు రోజుకు 2 సార్లు ఈ పండ్ల జ్యూస్‌ను తాగాలి. దీంతో త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. చురుగ్గా మారుతారు. బత్తాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది దంతాలు, చిగుళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. బత్తాయి పండ్లను తింటే నోట్లో లాలా జలం అధికంగా స్రవించబడుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులభంగా, త్వరగా జీర్ణం చేస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

మలబద్ధకం ఉండదు..: బత్తాయి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే మలబద్ధకం తగ్గుతుంది. రోజూ ఉదయం సుఖ విరేచనం అవుతుంది. బత్తాయి పండ్లలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు, ఆమ్లాలు విడుదల అయ్యేందుకు సహాయం చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది.

ఏదైనా వ్యాధి వచ్చిన వారు బత్తాయి పండ్ల రసాన్ని సేవిస్తుంటే త్వరగాశక్తి లభించి రోగం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉదయం జాగింగ్ లేదా వాకింగ్, యోగా, వ్యాయామం చేసిన అనంతరం ఒక గ్లాస్ బత్తాయి పండ్ల రసం సేవిస్తే శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా టీ, కాఫీ వంటివి తాగకుండా బత్తాయి పండ్ల రసం తాగితే ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

విరేచనాల నుంచి ఉపశమనం..: బత్తాయి పండ్లలో ఉండే ఆమ్లాలు జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అజీర్తితో బాధపడేవారికి బత్తాయి రసం ఔషధంగా పనిచేస్తుంది. బత్తాయి పండ్లలో ఉండే పొటాషియంవిరేచనాలను తగ్గిస్తుంది. బాధితులు త్వరగా కోలుకునేలా చేస్తుంది. కామెర్లు వచ్చిన వారు ఈ పండ్ల రసం తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. వాంతులు, తలతిరగడం వంటి సమస్యలు ఉన్నవారు బత్తాయి పండ్ల రసం తాగితే మంచిది.

# కేబీఆర్ పార్క్ చుట్టూ సిగ్నల్ ఫ్రీ జంక్షన్




హైదరాబాద్, : కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం నెలరోజుల్లో ప్రారంభం కానుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతితో, రూ.1090 కోట్లతో ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌జీటీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సాయిల్ టెస్ట్ జరుపుతున్నారు. నిర్వాసితులకు టీడీఆర్ ఇచ్చేందుకు అంగీకరించారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సిగ్నల్ ఫ్రీ జంక్షన్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.కేబీఆర్ పార్క్ ప్రాంతంలో ట్రాఫిక్ మామూలుగా ఉండదు. ఈ సమస్య పరిష్కారం కోసం కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని తీసుకున్న నిర్ణయం ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. మరో నెలరోజుల్లోగా ఈ పనులు ప్రారంభం అవుతాయని సమాచారం. ఈ ప్రాజెక్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అనుమతి లభించడంతో పనులు త్వరలోనే మొదలవుతాయని భావిస్తున్నారు. రెండేళ్లలో ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంలో భాగంగా నేల పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి హెచ్–సిటీ ( హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రోగ్రామ్ కిందకు వస్తాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే కేబీఆర్ పార్క్ చుట్టూ ఉండే భారీ ట్రాఫిక్‌ను తగ్గించవచ్చు. ముఖ్యంగా ఐటీ కారిడార్ వైపు అంటే మదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, మణికొండ వైపు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.ఎందుకంటే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10, 12, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, మాసాబ్ ట్యాంక్ మార్గాల్లో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ఆఫీసు సమయాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్ల మీద నిలిచిపోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని భావించిన సర్కార్.. ఈ మార్గంలో సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల కోసం 6 ఫ్లైఓవర్లు, 6 అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది.ఇందుకు గాను ప్రభుత్వం రూ. 1090 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతాన్ని సిగ్నల్ ఫ్రీ కారిడార్‌గా అభివృద్ధి చేయడం వల్ల వాహనదారుల ప్రయాణ సమయం చాలా వరకు తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. సంవత్సరన్నర క్రితమే నేల పరీక్షలు చేసినా.. భూసేకరణ ఇబ్బందుల వల్ల ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు.ఈ క్రమంలో తాజాగా బల్దియా.. ప్రాజెక్టు వల్ల ఆస్తులు కోల్పోతున్న వారికి టీడీఆర్ ఇస్తామని హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో ప్రస్తుతం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి సంబంధించి సాయిల్ టెస్టింగ్ ప్రక్రియను ముమ్మరం చేశారు. దీని ఆధారంగా ఫ్లైఓవర్ల డిజైన్, నిర్మాణ విధానం, పిల్లర్ల ఎత్తును ఖరారు చేయనున్నారు. మరో రెండు రోజుల్లోనే సాయిల్ టెస్టింగ్ పూర్తి కానుందని, ఈ నేపథ్యంలో వచ్చే నెలలో నిర్మాణానికి సంబంధించిన పనులు మొదలు పెట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వల్ల సామాన్య ప్రజలతో పాటు కొన్ని వాణిజ్య సంస్థలుకూడా తమ ఆస్తులను కోల్పోతున్నాయి. ఈ క్రమంలో అధికారులు వీరికి పరిహారం గురించి ఒప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ నగదు పరిహారం కోరితే అక్కడున్న మార్కెట్ రేటుకు 2 రెట్లు ఎక్కువ ఇవ్వనున్నారు. లేదంటే టీడీఆర్ కోరితే మార్కెట్ విలువకు నాలుగు రెట్లు ఎక్కువ ఇస్తామని చెబుతున్నారు.

# సిటీలో రోడ్ల విస్తరణ



హైదరాబాద్,: హైదరాబాద్ వాసులకు హెచ్ఎండీఏ తీపి కబురు చెప్పింది. నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు ట్రాఫిక్ లేని ప్రయాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్తగా ఎలివేటెడ్ కారిడార్లతో పాటు.. కొన్ని జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. వ ఇప్పటికే చాలా వరకు ప్రాజెక్టులో మొదలు కాగా.. మరికొన్నింటికి టెండర్లను ఆహ్వానించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భూ స్థాయిలో 4 లైన్ల రోడ్డును.. దాంతో పాటే 6 లైన్ల రోడ్డుతో రెండు భాగాలుగా అనుసంధానం చేసే ప్రణాళికలను హెచ్ఎండీఏ చేపట్టింది.

హైదరాబాద్ మహానగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ రహదారుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా నగరం మధ్యలో నుంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేలా 6 లైన్ల రహదారుల నిర్మాణం.. ప్రస్తుతం ఉన్న 3 లైన్ల రోడ్లను 4 లైన్లుగా మార్చే పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది.ఐటీ కారిడార్‌లో అత్యంత రద్దీగా ఉండే నానక్‌రాంగూడ నుండి గచ్చిబౌలి వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇక్కడ సర్వీసు రోడ్డు కాకుండా ప్రధాన మార్గం మూడు వరుసలుగా ఉంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ల కారణంగా వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ రహదారిని 4 లైన్ల మార్గంగా మార్చనున్నారు. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 26.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ విస్తరణతో అవుటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం ప్రయాణికులకు సులభతరం కానుంది.కోకాపేట, మణికొండ, పుప్పాలగూడ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఎంజీఐటీ నుండి మణికొండ వరకు కొత్త రహదారిని నిర్మించనున్నారు. సుమారు 3.57 కిలోమీటర్ల పొడవునా నిర్మించే ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో 6 లైన్ల రహదారిగా తీర్చిదిద్దనున్నారు. రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, వరద నీటి కాలువలు, ఆధునిక ల్యాండ్‌స్కేపింగ్‌ను ఏర్పాటు చేస్తారు.

ఇది పూర్తయితే గండిపేట పరిసర ప్రాంతాల నుండి నగరంలోకి వచ్చే వాహనదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది.బంజారాహిల్స్ ఐసీసీసీ టవర్ నుండి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ నగర రవాణా వ్యవస్థలో కీలక మలుపు కానుంది. రూ. 1,656 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ కారిడార్ ద్వారా బంజారాహిల్స్ నుండి గచ్చిబౌలి వరకు ఎక్కడా సిగ్నల్స్ లేకుండా ప్రయాణించవచ్చు. ఈ మార్గంలో ఫిల్మ్ నగర్, టీహబ్, ఐటీసీ కోహినూర్ వంటి కీలక జంక్షన్ల వద్ద ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. భూస్థాయిలో.. ఎలివేటెడ్ విధానంలో 4, 6 వరుసలుగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం ద్వారా హైటెక్ సిటీ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తొలగిపోనున్నాయి.

# ఒక వైపు సొంత జిల్లా.. మరోవైపు పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు

హైదరాబాద్, : రానున్న మున్సిపల్, కార్పొరే షన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి పనిచేయడమంటే రెండు పడవల్లో కాళ్లు పెట్టి ప్రయాణించడంలా రాష్ట్ర మంత్రులు భావిస్తున్నారు. మున్సిపోల్స్‌లో భారీసంఖ్యలో మున్సిపల్, కార్పొరేషన్ స్థానాలు కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ సిద్ధం చేసుకుంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కాం గ్రెస్ పార్టీ మంత్రులకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించింది. దీంతో సొంత నియోజకవర్గం, జిల్లాలోని మున్సిపాలిటీలను గెలిపించుకోవడంతో పాటు.. మరోవైపు ఇన్‌చార్జ్‌గా ఉన్న పార్లమెంట్ నియోజక వర్గాల్లో పార్టీ విజ యం కోసం మంత్రులు పనిచేయాల్సి ఉంటుంది.అయితే ఈ ఎన్నికల్లో ఒకవేళ ప్రతికూల ఫలితాలే వస్తే, ఆ ప్రభా వం తమపై పడుతుందనే భయం మంత్రులను వెంటాడుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు.. పురపోరులో పోటీ చేసే ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో వార్డుకు కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేసేవారు పదుల సంఖ్యలో ముందుకొ చ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో మిగతావారిని ఒప్పించి.. ప్రజల్లో పట్టున్న వారినే ఎంపిక చేయాలని పార్టీ పెద్దలు సూచించారు. ఈ విషయంలో ఎంత ప్రయత్నించినా, టికెట్ రానివారు రెబల్స్‌గా బరిలో ఉండేందుకు సిద్ధమవుతారు.ఇలాంటి సమయంలో ఇన్‌చార్జ్‌లుగా ఉన్న మంత్రు లు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఒకవేళ రెబల్స్ బుజ్జగింపులకు తలొగ్గకుండా బరిలోనే ఉంటే.. పార్టీ అభ్యర్థుల విజయంపైన ప్రభావం కనిపిస్తుంది.

అది ప్రతికూలమైతే, ఫలితాల తర్వాత మిగిలేది తలవంపులేనని మంత్రులు భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో జరిగిన చిన్న చిన్న పొరపాట్లు.. పురపోరులో జరగకుండా చూ డాల్సి బాధ్యత కూడా మంత్రులపైనే పెట్టా రు. ఇది తమకు ఒక టాస్క్‌గానే ఉంటుందని కొందరు మంత్రులు అంతర్గతంగా ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఒక్కో డివిజన్‌కు ఒక మంత్రికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.దీనితోపాటు 100 ఓట్లకు ఒక పార్టీ నాయకుడిని నియమించడం వల్లే విజయం సాధ్యమైందనే విషయం వారు గుర్తుచేస్తున్నారు. కానీ, మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో ఇటు సొంత జిల్లాలు, అటు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్న పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కేడర్‌ను సమన్వయం చేయడం, రెండుచోట్లా అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయడం అంత సులువైన పనేమి కాదనే చర్చ జరుగుతోంది. ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలతో పాటు సొంత నియోజకవర్గంలో ప్రచారం చేయడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

# మావోయిస్టుల లొంగుబాటు..

**కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలనే ఈ నిర్ణయం!**

**లొంగిపోయిన మావోయిస్టుకు పునరావాస పథకం..**



గోదావరిఖని: లొంగిపోయిన మావోయిస్టుకు పునరావాస పథకం.. నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది మిలీషియా, కోరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ సభ్యులు రామగుండం కమిషనరేట్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్నటువంటి వివిధ రకాల సహాయ సహకారాలు, లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణను గురించి తెలుసుకుని లొంగిపోయారని వెల్లడించారు. తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకున్నామన్నారు. మిలీషియా, కోరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ మావోయిస్టులని తెలిపారు. వీరు ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించారన్నారు. ధర్మాజీ శ్రీకాంత్, పొడియం కాములు, ముడియం జోగ, కుంజం లక్కె (క్ష్మ), మోదం భీమ, కుంజం ఉంగా, ముడికం సుక్రం, ముడియం మంగు లొంగిపోయారు.

తెలంగాణ మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి రావాలి..: శ్రీకాంత్ ఒక్కడే తెలంగాణకి చెందినవాడు, మిగిలిన వాళ్ళందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంపుర్ గ్రామం, గాంగేలురు పోలీస్ స్టేషన్ పరిధికి చెందినవారని తెలిపారు. తెలంగాణ మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి రావాలని, తెలంగాణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అజ్ఞాత మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి వచ్చినట్ల యితే, తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చే పునరావాస పథకాలు, ఇతర సహాయ సహకారాలు అందిస్తామన్నారు. స్వతంత్రంగా జీవించే విధంగా ప్రభుత్వం వారికి అన్నివిధాల తోడ్పాటును అందిస్తుందని, మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్మెంట్ పూర్తిగా తగ్గిపోయిందన్నారు. అజ్ఞాతంలో ఉన్న అదిలాబాద్, కరీంనగర్ జిల్లా మావోయిస్టులు గ్రామాలకు తిరిగి రావాలని కోరుతున్నాం. ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్‌లు రాజేంద్ర ప్రసాద్, భీమేష్, ఆర్ ఐ శేఖర్, ఆర్ ఎస్ ఐలు వెంకట్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల అభ్యున్నతికి కృషి చేయాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ : బాలికల పట్ల వివక్షతను ప్రదర్శించకుండా వారి అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ నగరంలో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పాత కలెక్టరేట్ గ్రౌండ్ నుండి ప్రధాన వీధుల మీదుగా న్యూ అంబేద్కర్ భవన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. బేటీ బచావో – బేటీ పడావో, బాలికలను రక్షిద్దాం అని నినాదాలు చేస్తూ విద్యార్థినులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రసూల్ బీ, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభం



పెగడపల్లి (ధర్మపురి) : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్ క్లస్టర్ పరిధిలోని రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాజారాం పల్లి గ్రామ పంచాయతి కార్యాలయంలో ఎల్లాపూర్ క్లస్టర్ పరిధిలోని ఎల్లాపూర్, రాజరాం పల్లి, రాంభద్రుని పల్లి, కీచులాటపల్లి గ్రామాల రైతులకు ఫార్మర్ రిజిష్ట్రీ (కేవైసీ) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజారాం పల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, ఉప సర్పంచ్ ఎగుర్ల మహేంధర్, పంచాయతి కార్యధర్శి శీలం నరేంధర్, వ్యవసాయ విస్థరణ అధికారి అక్షయ్ కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు మిట్టపెల్లి రాజేంధర్ రెడ్డి, వార్డు సభ్యులు మంద్రశీనివాస్‌గౌడ్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సిబ్బంది ధర్నా

నిజామాబాద్ : గంజాయి ముఠా కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయం ఎదుట ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ధర్నాకు దిగారు. దీంతో ఈ కేసు మరో ములుపు తిరిగింది. ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యకు న్యాయం జరగాలంటూ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఎక్సైజ్ ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గంజాయి నియంత్రణలో భాగంగా ఎక్సైజ్ శాఖలో ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బంది పై ఒత్తిళ్లు, వేధింపులు ఎక్కువయ్యాయని సిబ్బంది వాపోతున్నారు. గంజాయి విషయంలో కింది స్థాయి సిబ్బంది పై ఎక్సైజ్ సీఐల వేధింపుల పై ఉద్యోగులు ఎక్సైజ్ సూపరిండెంట్ ను మల్లారెడ్డిని నిలదీశారు.

# 19 లక్షలకే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు...

హైదరాబాద్, : తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ హైదరాబాద్‌లో సొంతింటి కల కలిగిన వారి కోసం 289 రెడీ–టు–మూవ్ ఫ్లాట్ల విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. నల్లగండ్ల, మియాపూర్, బండ్లగూడ వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ ఫ్లాట్లను పారదర్శకమైన ఆన్‌లైన్ లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. సింగిల్ బెడ్రూమ్ ధరలు రూ. 13 లక్షల నుండి ప్రారంభం కాగా.. డబుల్ బెడ్రూమ్ ధరలు రూ. 19 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తుదారులు జనవరి 31 లోపు టోకెన్ అడ్వాన్స్ చెల్లించాలి. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో లాటరీ డ్రా నిర్వహిస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో సొంత ఇల్లు లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఐదేళ్ల లాక్–ఇన్ పీరియడ్ నిబంధన కూడా ఉంది.తెలంగాణ రాష్ట్రంలో సొంతింటి కలను నెరవేర్చే దిశగా మరో కీలక అడుగు పడింది. తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెడీ–టు–మూవ్ ఫ్లాట్ల విక్రయానికి ప్రకటన విడుదల చేసింది. మంగళవారం (21–01–2026) నోటిఫికేషన్ జారీ చేస్తూ.. హైదరాబాద్ నగర పరిధిలోని కీలక ప్రాంతాల్లో నిర్మితమైన ఫ్లాట్లను లాటరీ విధానం ద్వారా కేటాయించనున్నట్లు ప్రకటించింది.ఈ పథకంలో భాగంగా పోచారం, బండ్లగూడ, మేడ్చల్ మల్కాజ్‌గిరి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఉన్న ఫ్లాట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. 1ఃఊఐ, 2ఃఊఐ ఫ్లాట్లు వివిధ విస్తీర్ణాల్లో అందుబాటులో ఉండగా.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు అనుకూలంగా ధరలను నిర్ణయించారు. మొత్తం 289 ఫ్లాట్స్‌ను ఈ వేలం ద్వారా విక్రయించనున్నట్లు టీజీఆర్ఎస్సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. 1ఃఊఐ ఫ్లాట్ల విస్తీర్ణం సుమారు 523 నుంచి 645 చదరపు అడుగులు కాగా.. వాటి ధరలు రెగ్యూలర్ ఫ్లాట్స్‌కు సుమారు రూ. 13 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు నిర్ణయించారు. అలాగే 2ఃఊఐ ఫ్లాట్లు 761 చదరపు అడుగుల విస్తీర్ణంతో.. రెగ్యులర్ ఫ్లాట్ల ధరలు రూ.19 లక్షలుగా నిర్ణయించారు. ఇక మోడల్ ఫ్లాట్ల ధరలు ఒక చదరపు అడుగుకి రూ.2750 నుంచి రూ. 2500లుగా నిర్ణయించారు.. డబుల్ బెడ్రూం ఫ్లాట్స్‌కు ఒక చదరపు అడుగుకి రూ.3200లుగా నిర్ణయించారు. ప్రతి ఫ్లాట్‌కు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలతో పాటు పార్కింగ్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఫ్లాట్ల కేటాయింపు పూర్తిగా ఆన్‌లైన్ లాటరీ విధానంలో జరగనుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జనవరి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఫిబ్రవరి 4 మరియు 5 తేదీల్లో లైవ్ లాటరీ డ్రా నిర్వహించనున్నారు. ఈ లాటరీ డ్రాను యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనుండటంతో.. పూర్తి పారదర్శకత ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో దరఖా స్తుదారుడి ఆదాయం నెలకు.. 1ఃఊఐ ఫ్లాట్లకు రూ. 35,000, ఫ్లాట్లకు రూ. 50,000గా నిర్ణయించారు. వీటితో పాటు.. నో హౌస్ సర్టిఫికేట్ ను డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు.. ప్రాజెక్ట్ సైట్ లో సమర్పిం చాల్సి ఉంటుంది. దరఖాస్తుదారు, వారి కటుంబ సభ్యులకు కొత్త జీహెచ్ఎంసీ పరిధిలో ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదని కండీషన్ పెట్టారు. వీటితో పాటు.. దరఖాస్తుదారుడు ఒక కుటుంబం నుంచి ఒక్క దరఖాస్తు మాత్రమే సమర్పించాలి. ఆస్తిని ఇతరులకు బదిలీ చేయడానికి తప్పనిసరిగా లాక్ ఇన్ పిరియడ్ 5 ఏళ్ల వరకు ఉంటు ందన్నారు.ఇక రిజిస్ట్రేషన్



చేసుకునే వారు సింగిల్ బెడ్రూం ఫ్లాట్స్ కు టోకెన్ అడ్వాన్స్ రూ.లక్ష.. డబుల్ బెడ్రూం ఫ్లాట్స్‌కు టోకెన్ అడ్వాన్స్ రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గడువు జనవరి 31 సాయంత్రం 5 గంటల వరకు ఇచ్చారు. లాటరీలో ఎంపిక కాకపోయిన వారికి ఈ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని ప్రకటించి ంది.ఇక ఈ ఫ్లాట్లు నగరంలోని ఐటీ కారిడార్లు, రాఖీఖీ, మెట్రో, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు సమీపంలో ఉండటం ప్రత్యేక ఆకర్ష ణగా నిలుస్తోంది. స్వగృహ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసు కోవచ్చని.. సందేహాల కోసం హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబా టులో ఉంచామని అధికారులు తెలిపారు. మొత్తంగా చూస్తే... పెరుగుతున్న రియల్ ఎస్టేట్ ధరల మధ్య ప్రభుత్వ ఆధ్వర్యంలో నమ్మకమైన గృహావకాశం పొందే అవకాశంగా ఈ స్వగృహ ఫ్లాట్ల విక్రయం నిలవనుంది. సొంతింటి కలతో ఎదురుచూస్తున్న అనేక కుటుంబాలకు ఇది ఒక మంచి అవకాశంగా మారిందని చెప్పవచ్చు.

# విదేశీ సంస్థల పెత్తనంలో మన బ్యాంకులు!



భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. ఐతే ఆ వాటా 15 శాతానికి మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంక్ పరిమితి విధించింది. ఈ పరిమితిని ఆ యా సందర్భాన్ని బట్టి పెంచే అవకాశం ఉంది. ఏదేమైనా చట్టం ప్రకారం ఈ 15 శాతం పరిమితి అనేది ఇప్పటికీ కొనసాగుతోంది. ఐనప్పటికీ, 2018లో కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ అనే కంపెనీ, (ఇది మారిషస్ నుంచి కార్యకలాపాలు నడుపుతోంది) కేరళ లోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ వాటాలలో 51 శాతాన్ని కొనుగోలు చేయడానికి అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం గాని, రిజర్వు బ్యాంక్ గాని 15 శాతం పరిమితిని ఇలా 2018లో ఉల్లంఘించవ లసిన అగత్యం ఏమిటో వివరించనేలేదు. అంతకు మునుపు, 1994లో (నయా ఉదారవాద విధానాల తొలి దినాల్లో) ఎస్ఎస్ చౌవాలా గ్రూపు సంస్థ (ఇది థారులాండ్ నుండి నడుస్తోంది) ఇదే బ్యాంకులో 34 శాతం వాటాలను కొనుగోలు చేస్తానని ముందుకొచ్చినప్పుడు ఆ అభ్యర్ధనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అలా తిరస్కరించడం సరైనది. కాని ఆ తర్వాత 2018లో ఎందుకు అనుమతించారో ఇప్పటికీ వివరణ లేదు. ఇప్పుడు ఐడిబిఐ బ్యాంక్ (ఇండిస్టియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ఒక విదేశీ ప్రైవేటు సంస్థకు అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఐడిబిఐ బ్యాంక్ ప్రభుత్వ రంగ సంస్థగా ప్రత్యేకంగా పరిగణించబడకపోయి నప్పటికీ, దానిలోని మెజారిటీ వాటాదారుడిగా ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న ఎల్ఐసి సంస్థ 2019 నుంచీ ఉంది. అందుచేత ఈ విషయమై ఎన్ని అభ్యంతరాలు వెలువడుతున్నప్ప టికీ, విదేశీ సంస్థలు మన దేశీయ బ్యాంకుల మీద పెత్తనం పొందడానికి అనుమతించేందుకు ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా మొగ్గు చూపుతోంది. ఎందుకు ఈ విధంగా జరుగుతోం దన్న విషయాన్ని ఇంతవరకూ వివరించే ప్రయత్నం ప్రభుత్వం గాని రిజర్వు బ్యాంక్ గాని చేయలేదు. సాధారణంగా ఇటువంటి ప్రధాన, విధానపరమైన మార్పులు చేపట్టినప్పుడు 'విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసం' అంటూ సాకులు చెప్తారు. కాని ఈ సారి అటువంటిది కూడా లేదు. ఐతే, అటువంటి సాకు ఈ విషయంలో నిలబడదు. విదేశీ సంస్థలు మన బ్యాంకుల వాటాలను కొనుగోలు చేస్తే వచ్చే మొత్తమే చాలా తక్కువ. కేథలిక్ సిరియన్ బ్యాంక్‌లో 51 శాతం వాటాలను కొనుగోలు చేసిన ఫెయిర్ ఫాక్స్ సంస్థ చెల్లించినది కేవలం రూ.1200 కోట్లు మాత్రమే. పైగా, జూన్ 2024లో తమ వాటాల్లో కేవలం 9.72 శాతం వాటాలను అమ్మి రూ.592 కోట్లు, అంటే తాము చెల్లించిన దాంట్లో దాదాపు సగం, తిరిగి పొందారు. మన బ్యాంకుల యాజమాన్యం విదేశీ కంపెనీల చేతుల్లో ఉంటే అప్పుడు మన దేశంలోకి పెట్టుబడులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది అన్న వాదన కూడా పూర్తిగా తప్పుడు వాదనే. గతంలో విదేశీ వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను రిజర్వు బ్యాంక్ ఖచ్చితంగా పాటించినప్పుడు కూడా విదేశీ పెట్టుబడులు బాగానే వచ్చాయి. ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రావడం తగ్గిపోయి, వెనక్కి వెళ్ళిపోవడం పెరుగుతోందంటే అందుకు వేరే కారణాలు ఉన్నాయి (ఉదాహరణకు ట్రంప్ సుంకాల పెంపు). కొన్ని బ్యాంకులను విదేశీ సంస్థలకు అమ్మేసినంత మాత్రాను విదేశీ పెట్టుబడులు వెనక్కి పోతున్న ధోరణిని ఆపడం కూడా సాధ్యం కాదు. విదేశీ సంస్థల పెత్తనం కిందికి మన దేశీయ బ్యాంకులను అనుమతించే ప్రక్రియ ఎందుకిలా గోప్యంగా ముందుకు సాగుతోంది అందునా అటువంటి ప్రక్రియ వలన మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వినాశకర ఫలితాలను చవి చూడవలసి వస్తుందని గుర్తించిన తర్వాత కూడా ఎందుకిలా జరుగుతోంది (మన బ్యాంకులలో విదేశీ సంస్థల వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను తొలుత రూపొందించి అమలు చేసినది ఇందుకే కదా)! బ్యాంకుల యాజమాన్యం విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే జరిగే హాని గురించి ఉన్నదానికన్నా ఎక్కువ చేసి చెప్తున్నారన్న వాదన ఉంది. భారతీయ బ్యాంకులు విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేయడం గురించి రిజర్వు బ్యాంక్ కొన్ని నిబంధనలను రూపొందించింది. ఆ నిబంధనలు మన బ్యాంకులకు కొన్ని పరిమితులు విధించాయి. ఆ పరిమితులకు లోబడి వ్యవహరించి నంత కాలం మన బ్యాంకుల యాజమాన్యం ఎవరి చేతుల్లో ఉందన్నది అంత ప్రధానం కాదు. ఈ వాదనను ఒకవేళ అంగీకరించినా, అసలు మన భారతీయ బ్యాంకులను విదేశీ సంస్థకు ఎందుకు అప్పజెప్పాలన్న ప్రశ్నకు అది సమాధానం చెప్పదు. విదేశీ సంస్థల చేతుల్లో ఉంటే మన బ్యాంకుల నిర్వహణ బాగా మెరుగు పడుతుందన్న వాదన సైతం చెల్లదు. నిజానికి మన బ్యాంకులు విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే అప్పుడు ఇక్కడ చిన్న స్థాయి రుణాలను పొందేవారికి ఆ బ్యాంక్ అందుబాటులో ఉండదు. నిజానికి బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు వారికే ప్రాధాన్యతనివ్వాలి. కాని విదేశీ సంస్థల చేతుల్లో ఉన్నప్పుడు ఆ విధంగా జరగదు. పైగా అత్యున్నత స్థాయి అధికారుల జీతాలు మాత్రం బ్రహ్మాండంగా పెరుగుతాయి. కేథలిక్ సిరియన్ బ్యాంక్ అనుభవం ఇదే.

అంతే కాదు, ఒకసారి మన బ్యాంకుల మీద పెత్తనం విదేశీ కంపెనీల చేతుల్లోకి పోయిన తర్వాత వాళ్ళు విదేశీ ఆస్తుల కొనుగోలు విషయంలో ఉన్న ప్రస్తుత నిబంధనలను, పరిమితులను ఎత్తివేయాలని మన ప్రభుత్వం మీద వత్తిడి పెంచుతారు. ఆ పరిమితులను ఎత్తివేస్తే అప్పుడు ఈ బ్యాంకులు విదేశీ స్పెక్యులేటివ్ వ్యాపారాల్లో పెట్టుబడులను ఎక్కువగా పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. ఎక్కువ లాభాలు వచ్చేటప్పుడు స్పెక్యులేటివ్ పెట్టుబడులైతే మాత్రం ఏమిటి నష్టం అని ప్రశ్నించవచ్చు. స్పెక్యులేషన్ అంటేనే ఒక తరహా జూదం. అందులో లాభాలు వస్తున్నప్పుడు బాగానే ఉంటుంది. ఐతే, ఆ లాభాల్లో ఒక్క పైసా కూడా డిపాజిట్‌దారుల ఖాతాల్లో పడదు. అంతా యజమానులకే పోతుంది. ఒకవేళ ఆ స్పెక్యులేషన్‌లో నష్టం వస్తే మాత్రం అప్పుడు బ్యాంకులు దివాలా తీసే ప్రమాదాన్ని కూడా ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు డిపాజిటర్లు తమ కష్టార్జితాన్నంతటినీ పోగొట్టుకునే దుస్థితి వస్తుంది. అందుచేత చాలా పెద్ద సంఖ్యలో ఉండే డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఈ స్పెక్యులేటివ్ పెట్టుబడులకు దిగడం అనేది చాలా హానికరం. అందువలన భారతీయ డిపాజిటర్లకు లాభాలు ఏవీ రావు సరికదా తమ సమస్తాన్నీ కోల్పోయే ప్రమాదం ఉంది. ఇదేదో పనీ పాటు లేనివాడెవడో ఊహించి చెప్తున్న విషయం కాదు. అమెరికాలో "హౌసింగ్ బుడగ" 2008లో పేలిపోయినప్పుడు ఆ బుడగ పెరుగుతున్న కాలంలో రుణాలు ఇచ్చిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని ప్రధాన బ్యాంకులన్నీ దెబ్బ తిన్నాయి. ఆ రుణాలన్నీ "పనికి మాలిన వ్యర్థ ఆస్తులు"గా ఆ బ్యాంకులకు మిగిలిపోయాయి. అప్పుడు ప్రభుత్వాలు బ్యాంకులకు భారీగా 'బెయిల్ ఔట్" ప్యాకేజీలు ప్రకటించవలసి వచ్చింది. ఆ బెయిల్ అవుట్ల కారణంగా డిపాజిటర్లు గణనీయంగా నష్టపోయారు. ఆ హౌసింగ్ బుడగ పేలుడు తాకిడి తగలకుండా తప్పించుకున్న ఒక ప్రధాన దేశం మనదే. ఎందుకంటే అప్పటికి మన భారతీయ బ్యాంకులలో విదేశీ ఆస్తుల వాటా నామమాత్రమే. దాని వలన "వ్యర్థ ఆస్తుల" వాటా కూడా చాలా తక్కువగానే ఉండింది. ప్రైవేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ మాత్రమే కాస్త గణనీయమైన మోతాదులో ఆ "వ్యర్థ ఆస్తులను" మూటగట్టుకుంది తప్ప ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ దాదాపు ఏ నష్టమూ చవిచూడకుండా బైటపడ్డాయి. ఇప్పుడు మన బ్యాంకుమీద పెత్తనాన్ని విదేశీ సంస్థల చేతుల్లో పెడితే అప్పుడు మన ఆర్థిక వ్యవస్థకు 2008 నాడు ఉన్న బలం ఇంకెతంమా త్రమూ ఉండదు.

బ్యాంకుల మీద విదేశీ పెత్తనాన్ని అనుమతించాలన్న వత్తిడి మనకు నయా ఉదారవాదం వైపు నుండి వస్తోంది. పెట్టుబడుల మీద ఏ విధమైన ఆంక్షలనూ నయా ఉదారవాదం అంగీకరించదు. అంతేగాక, భారత ఆర్థిక వ్యవస్థ మీద తన పట్టు పెరగాలంటే భారతీయ బ్యాంకుల మీద పెత్తనం సాధించడం సామ్రాజ్యవాదానికి కీలకమైన అంశంగా ఉంటుంది (నయా ఉదారవాదం అంటేనే సామ్రాజ్యవాదపు వ్యూహం అని మనం గ్రహించాలి). విదేశీ యజమానికి విదేశీ ప్రభుత్వం నుండి పూర్తి దన్ను లభిస్తుంది. అదే మాదిరి దన్ను భారతీయ యజమానికి మన ప్రభుత్వం నుండి అభించదు.

# పడక గదిలో సీసీ కెమెరాలు..!

తిరుపతి, : ఒక మనిషిని గెలవాలంటే నేరుగా తలపడాలి. యుద్ధక్షేత్రంలో ప్రత్యర్థిని ఓడించాలంటే ముందుగా మన సత్తా ఏమిటో చూపించాలి. అలాకాకుండా వెన్నుపోటు పొడిచి.. దొడ్డి దారి ప్రణాళికలు రూపొందిస్తే దానిని యుద్ధ రీతి అనరు. ఇటువంటి విధానాన్ని అమలు చేసిన ఓ రాజకీయ నాయకుడు ఇప్పుడు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. విపరీతమైన విమర్శలను చవిచూస్తున్నాడు. తట్టుకోలేక రాష్ట్రానికి దూరంగా ఉంటున్నాడు.ఆ రాజకీయ నాయకుడికి బలమైన నేపథ్యం ఉంది. ఆయన తండ్రి మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆ నాయకుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలో ఉంది. ఆ నియోజకవర్గ ప్రజలు దీవించారు కాబట్టి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. మరోసారి ఆయన గెలవాలంటే గొప్ప పనులు చేయాలి. ప్రజల మనసులో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోవాలి. అవసరమైతే తనకు శత్రుత్వం అనేది లేకుండా.. ప్రత్యర్థి అనే వ్యక్తి ఉండకుండా చూసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే ముందుగా ఆ రాజకీయ నాయకుడిలో మంచితనం ఉండాలి. కానీ ఎమ్మెల్యే గా గెలిచిన ఆ నాయకుడిలో మంచితనం అనేది లేకుండా పోయింది. ముంచేతనం అనేది పెరిగిపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా తనకు ప్రత్యర్థిగా ఉన్న ఒక మహిళపై పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారింది.ఆమె ఉన్నత విద్యావంతురాలు. తన నియోజకవర్గానికి సేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చారు. అంతేకాదు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేశారు. డబ్బు కూడా భారీగా ఖర్చు పెట్టారు. ఆమె భర్త కూడా ఇందుకు సహకరించారు. అయితే ఆమెకే టికెట్ అనుకుంటున్న క్రమంలో.. ఊహించిన విధంగా పొత్తు ఏర్పడింది.. దీంతో ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పొత్తు ధర్మంలో భాగంగా భాగస్వామ్య పార్టీకి సపోర్టు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఆమెకు ఎమ్మెల్యే యోగ్యం దక్కలేదు. సరే తమతో పొత్తు కుదుర్చుకున్న పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారని.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని ఆమె గొప్పగా చెప్పుకుంది. అంతేకాదు అధికారంలోకి తమ పార్టీ భాగస్వామిగా ఉన్న సమూహం రావడంతో ఆనందపడింది. కానీ ఇక్కడే ఆమె ఆనందం ఆవిరైంది. దానికి ప్రధాన కారణం ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే నే.ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఆ నాయకుడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి తనకు రాజకీయ శత్రుత్వం ఉండకూడదని ఆయన భావించాడు. అందువల్లే తమ సమూహంలో ఉన్న పార్టీకి సంబంధించిన నాయకురాలికి అసలు రాజకీయ జీవితంలో లేకుండా చేయాలని అనుకున్నాడు. ఆమె దగ్గర పని చేస్తున్న ఒక వ్యక్తిని దగ్గరికి తీసుకున్నాడు. డబ్బు ఆశ చూపించాడు. అయితే ఆ నాయకురాలికి మరొక వ్యక్తితో సంబంధం ఉండేది. ఇదే అదునుగా భావించిన ఆ ఎమ్మెల్యే ఆ నాయకురాలి వద్ద పనిచేస్తున్న వ్యక్తితో చేయకూడని కార్యక్రమాలు చేయించాడు. ఆ నాయకురాలు పడకగదిలో సీసీ కెమెరాలు పెట్టించాడు.. దీంతో ఆ నాయకురాలు తన ప్రియుడితో సాగించే సరసాలు అందులో రికార్డ్ అయ్యాయి. ఈ వీడియోలు మొత్తం కూడా ఆ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకు పంపించాడు. ఆ వీడియోలను అడ్డం పెట్టుకొని సదరు నాయకురాలిని బెదిరించేందుకు ఆ ఎమ్మెల్యే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. కానీ ఇంతలోనే ఆ నాయకురాలు తన వద్ద పనిచేసే వ్యక్తి వీడియోలు పంపిస్తుండగా చూసింది.. ఆ తర్వాత ఈ విషయాన్ని తన భర్తకు వేరే విధంగా చెప్పింది. దీంతో ఆమె భర్త.. తన అనుచరులతో కలిసిఓ ప్రణాళిక రూపొందించాడు. అంతేకాదు తమ వద్ద పనిచేస్తున్న ఆవ్యక్తిని అంతం చేశాడు. ఈ వ్యవహారంలో అతడు ప్రస్తుతం జైల్లో ఉంటున్నాడు. ఆవుల మంద పోట్లాడుకుంటే దూడల కాళ్ళు విరిగినట్టు.. ఎమ్మెల్యే, ఓ నాయకురాలు మధ్య ఏర్పడిన వివాదం చివరికి ఒక మనిషి ప్రాణం పోవడానికి కారణమైంది. అతని కుటుంబాన్ని దిక్కులేని వాళ్ళను చేసింది. అందుకే సాధ్యమైనంతవరకు పెద్దల వ్యవహారాలలో వేలు పెట్టకపోవడమే మంచిది.

# భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు!

ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిం చారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రోల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనాలో అస్సలు సాధ్యం కాదు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఎ బాగా పని చేస్తోందన్న విమర్శ లు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది. అలాగే పాక్‌ను మరోమారు దువ్వుతున్నారు. నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇతరదేశాల్లో వేలు పెట్టడం వల్ల తాము చాలా నష్టపోయామని అమెరికా ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కించడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు. సరిగ్గా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తీరు కూడా ఇరాక్‌ను పోలివుంది. హసీనా భారత్‌కు అనుకూలంగా ఉండడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదని అర్థం అవుతోంది. అందుకే ఆమెను పదవీచ్యుతురాలిని చేశాక భారత్‌లో ఆశ్రయం పొందారు. ఇప్పుడు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని అక్కడి ట్రిబ్యునల్ నిర్ణయించిం ది. ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ హసీనా ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిందని ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతాబలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించారంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు ప్రకటించారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. సరిగ్గా యాభైయేళ్ళ క్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది.

### జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్:స్థానిక కరీంనగర్ లోని మంకమ్మతోట దగ్గర్వాడి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ఈ నెల 22 న వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు నిర్వహించడం జరిగింది. ఇట్టి పోటీలలో సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 94 కేజీల విభాగంలో ఎమ్.డి. అయాన్ 60 కేజీల విభాగంలో ఎమ్.డి. సులేమాన్ గోల్డ్ మెడల్ సాధించారు. నవంబర్లో హన్మకొండలో 7,8,9వ తేదీలలో జరగబో యే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబరిచి స్వర్ణపతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి అభినందిస్తూ, పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకొనిరావాలని రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి డైరెక్టర్ స్పష్ట శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాకు ఆక్వా ప్రొడక్ట్స్

విజయవాడ,: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు చెబితేనే ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. పన్నులు పెంచి ప్రపంచ దేశాలను కోలుకోలేని దెబ్బతీశారు. ఆ దేశానికి ఉత్పత్తి అయ్యే అన్ని రకాల వస్తువుల పై భారీగా సుంకం పెంచి ప్రపంచంలో చాలా దేశాలను ఇబ్బంది పెట్టారు. అందులో బాధిత దేశంగా ఇండియా ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ పెంచిన సుంకాలతో మన దేశంపై పెద్ద ప్రభావమే పడుతోంది. ముఖ్యంగా ఆక్వారంగం కష్టాల్లో పడింది. రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఏపీ మంత్రి నారా లోకేష్ చతురతతో వ్యవహరించారు. అమెరికా ద్వారా జరిగిన నష్టాన్ని ఆస్ట్రేలియాతో బత్తి చేయడంలో లోకేష్ సక్సెస్ అయ్యారు. ఇది నిజంగా ఏపీలోని ఆక్వారంగానికి ఉపశమనం కలిగించే విషయమే.అగ్రరాజ్యం అమెరికాకు ఏపీ నుంచి ఆక్వా ఉత్పత్తులుఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. మొత్తం 100% ఉత్పత్తుల్లో 90 శాతం అమెరికాకే తరలిస్తుంటారు. అయితే ఆక్వాపై అమెరికాలో సుంకాలు పెంచడంతో.. ఏపీలో వాటికి సంబంధించిన ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆక్వాతో పాటు పదిరకాల అనుబంధ రంగాలపై కూడా ఇది ప్రభావం చూపింది. ఒక్కసారిగా రొయ్యల ధరలు సైతం పతనం అయ్యాయి. వాస్తవానికి మన రొయ్యలు జపాన్, చైనా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అయితే అమెరికాకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తులపై సుంకం విధించడంతో అక్కడ డోర్ క్లోజ్ చేసినట్లు అయింది. దీంతో దేశీయ మార్కెట్ రంగంపై ఏపీ ఆక్వా ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జపాన్ తో పాటు చైనాకు పరిమిత స్థాయిలోనే ఎగుమతులు అవుతున్నాయి. ఇటువంటి సమ యంలో ఆస్ట్రేలియా ఏపీ ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు ముందుకురావడం శుభ పరిణామం. దీనివెనుక మంత్రి నారా లోకేష్ కృషి ఉంది. ఆస్ట్రేలియా ఆక్వారంగా అధికారులు, ప్రతినిధులు తో సమావేశం అయినలోకేష్ వారినిఒప్పించగలిగారు.ఆస్ట్రేలియా గతం లో భారత్ నుంచి రొయ్యలను దిగుమతి చేసుకునేది. అయితే వైట్ స్పాట్ వైరస్ రొయ్యలు కావడంతోభారత్ నుంచిదిగుమతులను రద్దు చేసుకుంది. అప్పటినుంచి మన రొయ్యలపై ఆస్ట్రేలియాలో నిషేధం కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ ప్రతినిధులతో లోకేష్ సమావేశం అయ్యారు. ఏపీ ఆస్ట్రేలియా మధ్య ఆక్వా ఎగుమత్తుల అంశంపై వారితో చర్చించా రు. ఏపీలో ఈ రంగం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు. 2027 అక్టోబర్ 20 వరకు భారతీయ రొయ్యలను ఆస్ట్రేలియా దిగుమతి చేసుకునేందుకు అంగీకరించింది. ఈ మేరకు అక్కడి ప్రతినిధులు ఆమోదం తెలిపిన డాక్యుమెంట్లను జతచేస్తూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. ఏ ఏ రకాల రొయ్యలు? ఎంత ధరకు దిగుమతి చేసుకుంటారు? అన్న వివరాలను ఆ పత్రాలలో ప్రస్తావించారు.నారా



లోకేష్ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.' భారతదేశ నుంచి ఆస్ట్రేలియాకు రొయ్యల ఎగుమతుల్లో ఒక పెద్ద అడ్డంకి తొలగిపోయింది. గతంలో తెల్ల మచ్చ వైరస్ ఉన్న రొయ్యలను తొక్క తీయకుండా ఆస్ట్రేలియా దిగుమతి చేసుకోలేదు. కానీ ఇప్పుడు భారత్ నుంచి వచ్చే ఆ రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా అనుమతి ఇచ్చింది. ఈ విజయం వెనుక భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వా ల కృషి ఎంతో ఉంది. వారికి నా కృతజ్ఞతలు. ఒకే మార్కెట్ పై ఆధారప డకుండా.. కొత్త మార్కెట్లను ఓపెన్ చేయడం చాలా ముఖ్యం ' అన్నారు మంత్రి నారా లోకేష్. వాస్తవానికి ఆస్ట్రేలియాతో పాటు సౌదీ అరేబియాలో మన రొయ్యలకు గిరాకీ ఉంది. అయితే తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వం అంగీకారం తెలపడంతో సుమారు 8వేల కంటైనర్ల రొయ్యలను ఎగుమతి చేసే అవకాశం ఉంది. అమెరికాతో సమానమైన ధర లభిస్తుందని తెలుస్తోంది. మొత్తానికైతే ట్రంప్ కొట్టిన దెబ్బను ఆస్ట్రేలియాతో భర్తీ చేశారు మంత్రి నారా లోకేష్.

# అడవులపై వేటు



## వాణిజ్య తోటల పెంపకానికి మోడీ ప్రభుత్వం గ్రీన్ సిగల్
## పరిశ్రమలకు లాభం.. పర్యావరణానికి పెను ముప్పు

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని అడవులను ప్రయివేటుపరం చేసేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. దేశంలో అటవీ సంరక్షణకు సంబంధించిన చట్టాలను మరింత బలహీనపరుస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఒఇఎఫ్‌సిసి) కీలక నిర్ణయం తీసుకున్నది. అటవీ భూముల్లో ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలు వాణిజ్య తోటలు వేసుకునేందుకు అనుమతిస్తూ సంబంధిత మార్గదర్శకాలకు కీలక సవరణలు చేసింది. అటవీ భూముల్లో వాణిజ్య తోటలు పెంపకం కార్యక్రమాలను ఇకపై 'అటవీ కార్యకలాపాలు'గా పరిగణిస్తూ.. వాటికి నెట్ ప్రజెంట్ వ్యాల్యూ (ఎన్‌పివి) చెల్లింపు, పరిహార అటవీకరణ వంటి రక్షణ చర్యలను తొలగించింది. 2023లో అమల్లోకి వచ్చిన వన్ (సంరక్షణ మరియు అభివృద్ధి) అధినియం మార్గదర్శకాలకు ఈనెల 2న సవరణలు చేసింది. ఈ సవరణ పరిశ్రమలకు మేలు, అడవుల జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం కలిగించేదిగా ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2023 నాటి మార్గదర్శకాలకు ఈనెల 2న సంబంధిత మంత్రిత్వ శాఖ ఆమోదించిన ఒక సవరణ ద్వారా తాజా మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో అడవుల్లో వాణిజ్య తోటలను ఏర్పాటు చేయడానికి మరిన్ని సడలింపులు ఇచ్చినట్టయ్యింది. ఇప్పటి వరకు అడవి భూమిని లీజుకు తీసుకొని తోటలు వేయాలంటే అది 'అటవీయేతర కార్యకలాపం'గా పరిగణించబడేది. దీనికి ప్రయివేటు లేదా ప్రభుత్వ సంస్థలు తప్పనిసరిగా పరిహార అటవీకరణ చేయాలి. అలాగే 'కంపా'కు ఎన్‌పివి చెల్లించాల్సి ఉండేది. కానీ తాజా సవరణతో ఈ రెండింటినీ కేంద్రం పూర్తిగా తొలగించింది.

ఈ మార్పునకు కారణం?: అటవీ సలహా కమిటీ గతనెల డిసెంబర్ 2న సమావేశమైంది. దేశంలో కాగితం, పల్ప్, పేపర్‌బోర్డు దిగుమతులు భారీగా పెరిగాయని పేర్కొన్నది. 2024-25లో కాగితం దిగుమతులు 2.05 మిలియన్ టన్నులకు చేరగా.. 2020-21లో అవి 1.08 మిలియన్ టన్నులే.

ఈ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'క్షీణించిన అడవీ ప్రాంతాల్లో' తోటలు అవసరమని కమిటీ అభిప్రాయపడింది. అందుకే రాష్ట్ర అటవీ శాఖలు రూపొందించే వర్కింగ్ ప్లాన్ లేదా మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆధారంగా ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో తోటలు ఏర్పాటు చేయడాన్ని కేంద్రం అనుమతించింది.

నిపుణుల ఆందోళనలు: కేంద్రం నిర్ణయంపై పర్యావరణవేత్తలు, నిపుణుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. "వాణిజ్య తోటలు అడవులు కావు. ఇవి జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తాయి. ఈ మార్పు జీవ సంరక్షణ లక్ష్యాలకు పూర్తిగా విరుద్ధం" అని పర్యావరణవేత్త రిత్విక్ దత్తా అన్నారు. "నిబంధనలను మరింత సడలించారు. పరిశ్రమలకు లాభం చేకూర్చేందుకే ఈ మార్పును తీసుకొచ్చారు. దేశ పర్యావరణ భద్రతకు ఇది ప్రమాదకరం" అని మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి ప్రకృతి శ్రీవాస్తవ తెలిపారు.

'ప్రయివేటు సంస్థలు వేగంగా పెరిగే యూకలిప్టస్, టీక్ వంటి చెట్లనే పెంచుతాయి. ఇవి వన్యప్రాణులకు అవసరమైన పొదలు, మృత వృలు, సహజ నిర్మాణాన్ని కలిగి ఉండవు. ఒక తోట ఎన్నటికీ అడవి కాలేదు" అని ఓ సీనియర్ అధికారి చెప్పారు. ఈ నిర్ణయం దేశంలోని అడవులకు విపత్తు కలిగిస్తుందని మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి ఆర్‌పీ బాల్వాన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. పరిశ్రమల ప్రయోజనం కోసమే ఈ నిర్ణయాన్ని తీసుకున్నారనీ, 1980 నుంచి కార్పొరేట్లు అడవీ భూమిపై కన్నేశాయని అన్నారు. తాజా నిర్ణయంతో వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని తెలిపారు.

రాజకీయ దుమారం: కేంద్రం నిర్ణయం ఇటు రాజకీయంగానూ తీవ్ర దుమారాన్నే రేపుతున్నది. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తాజా మార్పులను తీవ్రంగా తప్పుబట్టారు. 2023లో ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ సవరణల సమయంలోనే అడవుల ప్రయివేటీకరణ జరుగుతుందని తాము హెచ్చరించామని ఆయన గుర్తు చేశారు. తాజా పరిణామం దానికి నిదర్శనమనీ, ఇది ఆరంభం మాత్రమేనని ఆయన ట్వీట్ చేశారు. వన్ అధినయం చట్టంలోని సెక్షన్ 3సి కేంద్రానికి ప్రత్యేక అధికారాలను కల్పించింది. పార్లమెంటు అనుమతి లేకుండానే కేంద్రం ఆదేశాలు, సవరణలు చేయొచ్చు. దీంతో తాజా నిర్ణయం సర్వత్రా తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నది. దేశంలోని అడవుల పరిరక్షణ, జీవవైవిధ్యం, వన్యప్రాణుల భద్రత.. ఇవన్నీ దేశ భవిష్యత్‌కు చాలా కీలకం. కానీ కేంద్రంలోని మోడీ సర్కారు అవేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నది. తాజా నిర్ణయం పర్యావరణ పరిరక్షణను తాకట్టు పెట్టి పరిశ్రమలకు ప్రయోజనాలను అందిస్తుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్పులు భారత అటవీ విధానాన్ని ఏ దిశగా తీసుకెళ్లాయోనన్న భయాన్ని వెలిబుచ్చుతున్నారు.

# కవ్విస్తున్న చైనా

న్యూఢిల్లీ, : భారత్‌తో మంచిగా ఉన్నట్లు నటిస్తూనే వెనుక గోతులు తవ్వే చర్యలో చైనా ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటుంది. తాజాగా పాకిస్థాన్, చైనా సంబంధాలు బలోపేతమయ్యాయంటూ బలుచిస్థాన్ మానవ హక్కుల కార్యకర్త మీర్ యార్ బలూచ్.. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) ప్రాజెక్టు చివరి దశకు చేరుకుందని.. ఈ క్రమంలో తన పెట్టుబడులను కాపాడుకోవడానికి వ్యూహాత్మకంగా వ్యహరిస్తున్న చైనా నేరుగా తన సైన్యాన్ని బలూచిస్థాన్ గడ్డపై దింపేందుకు సిద్ధమవుతోందని లేఖలో రాసుకొచ్చారు. బలూచిస్థాన్‌లో చైనా సైనిక ఉనికి కేవలం స్థానిక ప్రజల సమస్య మాత్రమే కాదని, దీనివల్ల భారత్‌కు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. బలూచిస్థాన్ రక్షణ, తమ దళాల సామర్థ్యాలను బలోపేతం చేయకపోతే దీర్ఘకాలంలో చైనా దళాలు మోహరించే అవకాశముందని, ఇదే జరిగితే భారత్ సరిహద్దులో భద్రతా సవాళ్లు ఊహించని రీతిలో పెరుగుతాయని హెచ్చరించారు. బలూచిస్థాన్ రక్షణకు హానీ కలిగించే ఇలాంటి అపవిత్ర కూటమిని అడ్డుకోవడానికి భారత్, బలూచిస్తాన్ మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. పాక్‌తో కలిసి చైనా పన్నుతున్న కుయుక్తులను అడ్డుకోవడంలో బలూచిస్థాన్ పూర్తి మద్దతు భారత్‌కే ఉంటుందని మీర్ యార్ బలూచ్ చెప్పడం ముదావహం. అయితే చైనా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడడం ఇదేమీ తొలిసారి కాదు. రెండు రోజుల కిందట చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి.. గతేడాది మేలో జరిగిన భారత్-పాక్ యుద్ధాన్ని ఆపేందుకు చైనా మధ్యవర్తిత్వం వహించిం దంటూ పేర్కొనడం ఆసక్తి కలిగించింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవే ఎక్కువగా ఉన్నాయని, దాని విలువ 81 శాతమని కూడా తేలింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అవకాశం వచ్చినప్పుడల్లా భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ పేర్కొన్న ప్రతీసారి భారత్ ఖండిస్తూనే వచ్చింది. ఇక బ్రహ్మపుత్ర నదిపై 15.27 లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రపంచంలోనే అతి పెద్ద ఆనకట్టను నిర్మిస్తున్నట్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటన చేశారు. ఈ ఆనకట్ట వల్ల బ్రహ్మపుత్రలో భారత్ వాటాకు గండిపడడంతో పాటు మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు వరద ముప్పు పెరిగే అవకాశముంటుంది. ఈ విషయమై భారత్ గతంలోనే చైనాను హెచ్చరించింది. ఇక మనతో సరిహద్దుల్లో అకారణంగా వైరానికి దిగడం చైనాకు అలవాటే. గతంలో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణే ఇందుకు ఉదాహరణ. అంతేకాదు చైనాకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ పదేపదే ప్రచారం చేసుకునే చైనా అందులోని కొన్ని గ్రామాల పేర్లు అనైతికంగా మార్చే ప్రయత్నాలు చేసి అప్రతిష్టను మూటగట్టుకుంది. చైనా తలపెట్టిన ప్రాజెక్టులు, ఆనకట్టలు అన్నీ పొరుగుదేశాల హక్కులను కాలరాసేవే. చైనా ప్రాబల్యకాంక్షవల్ల భారత్ సహా పొరుగు దేశాలన్నీ ఇబ్బందులకు గురవుతున్నాయి. మహామార్గం వన్ రోడ్డు వన్ బెల్ట్ ప్రాజెక్టు పేరిట భూటాన్, నేపాల్, తదితర పొరుగు రాష్ట్రాల్లో భూభాగాలను కాజేసే యత్నాలను చైనా ఇదివరకే ప్రారంభించింది. ఒకవైపు పాకిస్థాన్, మరోవైపు బంగ్లాదేశ్ తమ ధోరణితో ఇబ్బంది కలిగిస్తున్న వేళ తాజాగా చైనా కూడా తోడవ్వడంతో భారత్ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది.

# చెత్తను వేయకుండా సూపర్ ప్లాన్

విశాఖపట్టణం: ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నివారించేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో దీనినిఅమలు చేస్తోంది. చెత్త వేసే ప్రదేశాలను శుభ్రపరిచి.. దేవుడి ఫోటోలు, మొక్కల కుండీలు, ముగ్గులు ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఆ ప్రదేశంలో మరోసారి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇది మంచి ఫలితాలు ఇవ్వటంతో త్వరలోనే విశాఖ నగరం మొత్తం అనుసరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీధుల్లో నడిచివెళ్లేటప్పుడూ.. కొన్నిసార్లు గోడలపై గమనించే ఉంటారు.. ఇక్కడ మూత్రం పోసిన వాడు గాడిద. ఇక్కడ చెత్త వేస్తే శిక్షార్హం.. అంటూ కొటేషన్లు, హెచ్చరిక బోర్డులు గమనించే ఉంటారు. ఎవరెన్ని కొటేషన్లు రాసినా.. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా కొంతమంది మాత్రం పద్ధతి మార్చుకోరు. పరిశుభ్రతతో పనిలేదు.. అధికారులహెచ్చరికలతో అస్సలు అవసరం లేదు..తమ పంథా తమదే..తమ పని తమదే. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు..చెత్త వేసే స్తూ ఉంటారు. ప్రభుత్వం ఇంటింటికీ చెత్త సేకరణ జరుపుతున్నా.. చెత్త కుండీలు ఏర్పాటు చేసినా క డా ఇలాంటి వారిలో మార్పులు ఆశించడం అత్యాశే అవుతోంది. కాలనీలలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్తను పారబోస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమ వుతున్నారు. అలాంటి చోట్ల అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇలాంటి వారిలో ఎలాంటి మార్పూ లేదు. దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొ రేషన్ (జీవీఎంసీ) ఓ సరికొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకా రంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. ఎక్కడైతే వ్యర్థాలను పారేస్తున్నారో అలాంటి ప్రదేశాలను గుర్తించి.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంచేస్తున్నారు. ఆ తర్వాత దేవుడి ఫోటోలు పెట్టి.. ముగ్గులు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల కుండీలలో మొక్కలు ఉంచుతున్నారు. ప్రయోగాత్మకంగా కొన్నిచోట్ల ఈ పద్ధతి అనుసరించగా సత్ఫలితాలు వచ్చాయి. అ ందుకే విశాఖపట్నం నగరం మొత్తం ఈ విధానం అనుసరించాల నిజీవీఎంసీ ఆలోచనలు చేస్తోంది. దేవుడి ఫోటోలు పెట్టడం, ము గ్గులు పెట్టటంతో చెత్త వేసేవారిలో మార్పు వస్తోంది. తమ చర్యలను విరమించుకుంటున్నారు. దీంతో విశాఖపట్నం మొత్తం ఈకార్యక్రమం అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వవార్డులో ఉన్న ఎంవీపీ కాలనీ సెక్టార్9లో ఇటీవల జీవీఎంసీ ఈ కార్యక్రమం నిర్వహించింది.




# 2వేల 200 కిలోమీటర్లకు గ్రేటర్ హైదరాబాద్




హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీని విస్తరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌ను (ఔటర్ రింగ్ రోడ్) ఆనుకుని ఉన్న 27అర్బన్ లోకల్ బాడీలను (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా తెలంగాణ మునిసిపల్ యాక్ట్, జీహెచ్ఎంసీ యాక్ట్‌ను సవరణ చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రాష్ట్రంలో మరో కొత్తడిస్కం (మూడోది) ఏర్పాటునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త డిస్కం పరిధిలోకి ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్స్ వస్తాయన్నారు. ఇక, ప్రతి కార్పొరేటర్ డివిజన్ కు రూ. 2కోట్ల విడుదలకు కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అటు 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉఊఓఅ లో కలిపుతూ ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం జీహెచ్ఎంసీ కౌన్సిల్ ముందు పెట్టారు మేయర్. 2 కోట్ల వరకు పనులకు నిధులు మంజూరు చేయడం మంచి నిర్ణయం అని కార్పొరేటర్లు అన్నారు. 2007 వరకు ఓఅఊ 173 చదరపు కిలోమీటర్లు ఉండేది. 2009కి ముందు 100 డివిజన్లు, 2009 తర్వాత 150 డివిజన్లు వచ్చాయి. 625 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించింది. ఇప్పుడు జీహెచ్ఎంసీ భారీగా విస్తరించనుంది. ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరిస్తే 2వేల 200 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరణ జరిగే అవకాశం ఉంది. దీంతో ఉఊఓఅలో డివిజన్లు భారీగా పెరగనున్నాయి. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, తుక్కుగూడ, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్. ఈ విలీనం ద్వారా జీహెచ్ఎంసీ పరిధి, జనాభా భారీగా విస్తరించనుంది. ఇక రాష్ట్రంలో మూడో డిస్కం (విద్యుత్ పంపిణీ సంస్థ) ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్‌పై ఉన్న రూ. 59,671 కోట్ల నష్టాల భారాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రస్తుత డిస్కంల పరిధిలో ఉండగా.. మిషన్ భగీరథ, మెట్రో వాటర్ బోర్డులకు సంబంధించిన విద్యుత్ సరఫరాను కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురానున్నారు.

# కన్నీరు తెప్పిస్తున్న రొయ్యలు



ఏలూరు, : ఇన్నాళ్లు కాసుల వర్షం కురిపించిన రొయ్యల పెంపకం నేడు కన్నీరు తెప్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో రొయ్యల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంతో పాటు మరొక వైపు రొయ్యల పెంపకం ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలకు మాత్రం వారి సమస్యలు పట్టడం లేదు. ఎగుమతులు ప్రస్తుతం పెద్ద సమస్యను ఎదుర్కొంటున్నాయి. అమెరికా, యూరప్ దేశాలు రొయ్యలపై ఎక్కువ పన్నులు వేసేయడంతో చాలా ఆర్డర్లు రద్దయిపోయాయి. ఈ కారణంగా రాష్ట్రానికి దాదాపు ఇరవై ఐదు కోట్ల రూపాయల మేరకు నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. రొయ్యల పెంపకంలో వినియోగించే ఫీడ్, వినియోగించే మందులు, విద్యుత్తు ఛార్జీలతో ఖర్చు తడిసి మోపెడవుతుంది. తీరా రొయ్యల పంట చేతికి వచ్చేసరికి గిట్టుబాటు ధర లభించడం లేదు. గత కొన్ని రోజులుగా ఎగుమతులు నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తి అయ్యే రొయ్యలకు విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉండేది. కానీ అన్ని దేశాలు రొయ్యల ఎగుమతులపై పన్నులు పెంచడంతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశీయ మార్కెట్ లో రొయ్యలను విక్రయిస్తుండటంతో ధరలు కిందకు పడిపోయాయి. రొయ్యలు ధరలు భారీగా పడిపోవడంతో పెట్టుబడులు తిరిగి రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు అప్పుల్లో క రుకుపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో రొయ్య పిల్లలను సరఫరా చేసే హాచరీస్, ప్రాసెసింగ్ యూనిట్లు క డా తమ ఉత్పత్తులను తగ్గించుకున్నాయి. రొయ్యల కు డిమాండ్ తగ్గిపోవడంతో ఆ ప్రభావం రవాణా, పోర్టు వంటి వాటిపై క డా పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని, రొయ్యలకు సరైన గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులకు వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని, ఫీడ్, మందులు సబ్సిడీ ప్రాతిపదికన అందించాలని కోరుతున్నారు.

## హస్తినపై మనస్సులో..
# అమరావతిలో తనువు

ఏలూరు, : డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఎమ్మెల్యే పదవి పట్ల సంతృప్తిగా లేరు. ఆయన చూపంతా హస్తినపైనే ఉంది. గత ఎన్నికల సమయంలో రఘురామ కృష్ణరాజు నరసాపురం పార్లమెంటు టిక్కెట్ కోసం చివర వరక ప్రయత్నించారు. అయితే అది బీజేపీ కోటాలోకి వెళ్లిపోవడంతో ఆయనకు ఎక్కడో ఒకచోట స్థానం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉండి శాసనసభ నుంచి టీడీపీ పోటీ చేయించింది. గెలిచిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవిని అప్పగించింది. కేబినెట్ ర్యాంకు పదవి అయినప్పటికీ ఆయన మనసంతా ఢిల్లీపైనే ఉంది. వచ్చే ఎన్నికల నాటికి తాను పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లే కనపడుతుంది. ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు క డా ఇలాగే ఉంటున్నాయి. ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు క డా ఇలాగే ఉంటున్నాయి. అయితే అప్పటికే ఉండి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంతెన రామరాజు ను ఒప్పించి రఘురామ కృష్ణరాజుకు టీడీపీ నాయకత్వం ఆ సీటును కేటాయించింది. మంతెన రామరాజుకు నామినేటెడ్ పోస్టు ఇచ్చింది. ఆయనను ఏపీఐఐసీ ఛైర్మన్ గా నియమించింది. అయితే అక్కడ జనసేన లో క డా కొంత అసంతృప్తి కనపడుతుంది. ఉండి నియోజకవర్గం తమకు కావాలని గత ఎన్నికల్లోనే జనసేన గట్టిగా పోరాడింది. అయితే రఘురామ కృష్ణరాజు కోసమే కాకుండా, టీడీపీ సిట్టింగ్ సీటు కావ డంతో జనసేకు ఇవ్వలేదు. పదవి దక్కకపోవడంతో ఆయన అసం తృప్తిగా ఉన్నారని సమాచారం. నాగరాజు శెట్టి బలిజ సామాజికవ ర్గం నేత కావడంతో ఆయన తన అసంతృప్తిని సన్నిహితుల ముందు వెళ్లగక్కుతున్నారట. మరొకవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాత్రం వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయడానికి పెద్దగా ఇష్టపడటం లేదు. రఘురామ కృష్ణరాజుకు రాష్ట్ర రాజకీయాల కంటే ఢిల్లీలో ఉండటమే ఎక్కువగా ఇష్టపడతారు.

# సినిమా

## నటిస్తున్నానంతే.. భయపడకు



శారీరకంగా ఎన్ని రకాల సమస్యలు ఉన్నా అనుకున్న సమయానికి షూటింగులకు హాజరు కావాల్సిన పరిస్థితి సినిమా వాళ్లది. ముఖ్యంగా ఈ విషయంలో కథానాయికలు బాగా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. తాజాగా ఓ బిడ్డకు జన్మనిచ్చిన బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఈ విషయంపై ఆసక్తికరంగా మాట్లాడారు. 'నాకు ప్రెగ్నెన్సీ ఎప్పుడు ఖరారైంది? షూటింగులను ఎలా మేనేజ్ చేశాను? అనే విషయాలపై చాలామందికి పలు అనుమానాలున్నాయి.

వారందరికీ క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నా. గర్భందాల్చిన ఏడో నెల వరకూ నేను నటిస్తూనే ఉన్నా. ఈ విషయం నా దర్శక, నిర్మాతలకు మాత్రమే తెలుసు. షాట్ ముగియగానే కారవాన్‌లోకి వెళ్లి, కడుపులో ఉన్న నా బిడ్డతోమాట్లాడేదాన్ని. 'కేవలం నటిస్తున్నానంతే.. భయపడకు' అంటూ నా బిడ్డకు భరోసా ఇచ్చేదాన్ని. 'వార్2'లో బికినీ సీన్‌పై కూడా చా లా వార్తలొచ్చాయి.

ఆ టైమ్‌లో నేను ప్రెగ్నెంట్ కాబట్టి, ఏఐ ద్వారా ఆ సీన్స్ మేనేజ్ చేశారని చాలా మంది రాశారు. అందులో ఏ మాత్రం నిజం లేదు. ఆఫిజిక్ నాదే. బికినీ ఫిజిక్ కోసం కఠోరమైన క్రమశిక్షణ పాటిస్తే ఆ రూపం వచ్చింది. అయితే.. ఆ సీన్స్ తీసేటప్పుడు నేను రెండో నెల గర్భిణిని. కాబట్టే తేడా కనిపించలేదు.'అంటూ చెప్పుకొచ్చింది కియారా అద్వానీ. ప్రస్తుతం 'కేజీఎఫ్'ఫేం యష్ 'టాక్సిక్' సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

## బాడీ షేమింగ్‌తో నరకం చూశా..





ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖా వాణి కుమార్తెగా ప్రేక్షకులకు పరిచయమైన సుప్రిత ఇటీవల తన వ్యక్తిగత జీవితంలోని కఠిన అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియా స్టార్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, ప్రస్తుతం హీరోయిన్‌గా సినీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రిత, సోషల్ మీడియాలో ఎదురైన విమర్శలు, బాడీ షేమింగ్ కామెంట్లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. బరువు తగ్గాలనే ఆరాటంలో తాను అనుసరించిన తప్పుడు ఆహారపు అలవాట్లు తన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయని వెల్లడించారు.రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తర్వాత ఒక్కసారిగా హెవీ ఫుడ్ తీసుకునేదాన్ని. దీంతో వాంతులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చాయి. 15 రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. నీళ్లు తాగినా కూడా పడని పరిస్థితి. ఆ నొప్పి తట్టుకోలేక ఒక దశలో 'నన్ను చంపేయండి' అని అమ్మను అడిగాను అంటూ తన అనుభవాన్ని వివరించారు. ఈ ఘటన తనను మానసికంగా కూడా తీవ్రంగా ప్రభావితం చేసిందని చెప్పారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న సుప్రిత తన కెరీర్‌పై స్పష్టతతో ముందుకు సాగుతున్నారు. కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా, మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలు వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా నటించడానికి సిద్ధమని తెలిపారు. ఇక అగ్ర హీరోల సినిమాల్లో కూడా తాను నటించాలనే ఆసక్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ సినిమాల్లో చెల్లెలి పాత్రలు వచ్చినా చేయడానికి రెడీ అని చెప్పారు. అయితే తనకు ఇష్టమైన విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేని సరసన అలాంటి పాత్రలు చేయడం కష్టమని సరదాగా వ్యాఖ్యానించారు. సుప్రిత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తల్లి ప్రోత్సాహంతో నటనలో శిక్షణ తీసుకున్న ఆమె, ఇప్పటికే కొన్ని సినిమాల ద్వారా ప్రేక్షకులను అలరించారు. బిగ్ బాస్ ఫేమ్ అమర్ దీప్ చౌదరి సరసన నటిస్తున్న 'చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. 2019లో 'మనీ మైండెడ్ గర్ల్ ఫ్రెండ్' షార్ట్ ఫిల్మ్‌తో ప్రారంభమైన సుప్రిత ప్రయాణం, ఇప్పుడు వెండితెరపై మరింత బలంగా కొనసాగుతోంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా ఆమె అడుగులు వేస్తున్నారు.

## మీనా కూతురు నైనిక ఫొటో వైరల్



సీనియర్ నటి మీనా తన వ్యక్తిగత జీవితం విషయంలో, ముఖ్యంగా తన కూతురు నైనిక ప్రైవసీ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటారో అభిమానులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలనటిగా 'తేరి' (తెలుగులో పోలీసోడు) సినిమాతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న నైనిక, ఆ తర్వాత వెండితెరపై చాలా అరుదుగా మాత్రమే కనిపించింది. తన కూతురు సాధారణ జీవితం గడపాలని, చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని మీనా తీసుకున్న నిర్ణయమే దీనికి కారణం. ఇంతటి జాగ్రత్తలు తీసుకుంటున్న సమయంలో, తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఫొటో మీనా అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. క్రిస్మస్ సందర్భంగా మీనా పక్కన నైనిక నిలబడి ఉన్నట్లు కనిపిస్తున్న ఆ ఫొటో నెట్టింట విస్తృతంగా షేర్ అవుతోంది. దీంతో "ఇన్ని రోజులు బయటకు రానివ్వని నైనిక ఫొటో ఇప్పుడు ఎలా లీక్ అయ్యింది?'' అనే సందేహాలు మొదలయ్యాయి. నిశితంగా పరిశీలిస్తే, ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫొటో ఒరిజినల్ కాదని, అది పూర్తిగా ఎడిట్ చేసిన ఫేక్ పిక్ అని స్పష్టమవుతోంది. మీనా విడిగా దిగిన ఒక తాజా ఫొటోను, నైనికకు సంబంధించిన పాత ఫొటోతో కలిపి ఎవరో కావాలని ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

ఇద్దరి హెయిర్ స్టైల్, లైటింగ్, ఫొటో క్వాలిటీ తేడాగా ఉండటం వల్ల ఇది ఫేక్ అన్న విషయం ఇట్టే అర్థమవుతోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఆ ఫొటోను షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నైనికదని చెప్పుకుంటున్నా, అది నిజమైన అకౌంటా? ఫేక్ అకౌంటా? అన్న దానిపై కూడా స్పష్టత లేదు. మీనా స్వయంగా బాలనటిగా కెరీర్ ప్రారంభించిన వ్యక్తి.

## మళ్లీ సందడికి సిద్ధమైన సుకుమార్-రామ్ చరణ్ కాంబో..



రామ్ చరణ్-సుకుమార్ కాంబోలో వచ్చిన రంగస్థలం టాలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ మూవీ తర్వాత అదే జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు సుకుమార్, స్టార్ హీరో రామ్ చరణ్ కలిసి ఆర్‌సీ17(వర్కింగ్ టైటిల్) పేరుతో కొత్త సినిమాను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూలై నెల నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. సుకుమార్ కథా పనులను పూర్తిచేసి, ప్రస్తుతం చివరి మెరుగులు దిద్దుతున్నారని తెలుస్తోంది. రంగస్థలం తరహాలోనే గ్రామీణ నేపథ్యంలో, భావోద్వేగాలు మరియు మాస్ అంశాలతో ఈ సినిమా రూపొందనున్నట్లు సమాచారం. సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందించనున్నారు. గతంలో వచ్చిన రంగస్థలం చిత్రం వసూళ్ల పరంగా మాత్రమే కాకుండా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. చిట్టిబాబు పాత్రలో రామ్ చరణ్ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అందుకే ఇప్పుడు ఈ కొత్త సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. మరోవైపు, రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్రీడా నేపథ్యంలో సాగే యాక్షన్ కథాచిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చరణ్ 'పెద్ది పెహిల్వాన్' పాత్రలో కనిపించనుండగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఏ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. ఇలా వరుస సినిమాలతో రామ్ చరణ్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే రామ్ చరణ్ నుండి మరి కొద్ది రోజులలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న పెద్ది చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. 1980ల నాటి ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం జూన్ 4న విడుదలకి సిద్ధమైంది. ఈ సినిమాలో చరణ్ 'పెద్ది పెహిల్వాన్' పాత్రలో కనిపిస్తుండగా, జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ'గా నటిస్తోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి భారీ తారాగణం ఉన్న ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, ఇందులోని 'చికిరి చికిరి', 'రైరె రారా' పాటలు సోషల్ మీడియాలో ఎంత ట్రెండ్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

## ఎన్టీఆర్, నీల్ సినిమాలో తల్లిగా కాజోల్





అగ్ర హీరో ఎన్టీఆర్ నటిస్తున్న పీరియాడిక్ పానిండియా యాక్షన్ డ్రామా 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్). ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే గుర్తుండిపోయేలా ఈ సినిమాను దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తున్నారని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో ఎన్టీఆర్ పాత్ర నెవర్ బిఫోర్ అనే స్థాయిలో ఉంటుందని తెలుస్తున్నది. కథ డిమాండ్ మేరకు ఈ సినిమా కోసమే భారీగా బరువు తగ్గారు తారక్. ఇప్పటివరకూ కర్ణాటకలోనూ విదేశాల్లోనూ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రస్తుతం భాగ్యనగరంలో చిత్రీకరణ జరుగుతున్నది. 1969 కాలంలో చైనా, బూటాన్, ఇండియా సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో ఈ కథ సాగుతుందని, తల్లి సెంటిమెంట్ ఈ సినిమాకు ప్రధాన బలమని, తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ఎన్టీఆర్ తల్లిగా సీనియర్ బాలీవుడ్ నటి కాజోల్ నటిస్తున్నారని, అలాగే మలయాళ నటుడు టివినో థామస్ కీలక పాత్రలో కనిపించి అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తారని మేకర్స్ చెబుతున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈచిత్రానికి సమర్పణ: ఎన్టీఆర్ ఆర్ట్స్.

## భానుచందర్ లేటెస్ట్ లుక్ వైరల్..



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 80, 90వ దశకాల్లో యాక్షన్ హీరోగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన భానుచందర్ తాజాగా మరోసారి వార్తల్లో నిలిచారు. ఒకప్పుడు చాక్లెట్ బాయ్‌గా, తర్వాత పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నారు. అయితే ఇప్పుడు ఆయన లేటెస్ట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్లను ఆశ్చర్యపరుస్తోంది. కోనసీమలోని అమలాపురానికి చెందిన ప్రముఖ వంట మాస్టర్, "గోదావరి రుచులు'' అధినేత చిట్టిబాబుకు భానుచందర్ వీరాభిమాని. చిట్టిబాబు వంటకాల రుచికి ఫిదా అయిన సెలబ్రిటీలలో భానుచందర్ కూడా ఒకరు. ఈ సందర్భంగా చిట్టిబాబు పెళ్లిరోజు వేడుకల సందర్భంగా భానుచందర్ ప్రత్యేక వీడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఆ వీడియోలో ఆయన కనిపించిన తీరు ఇప్పుడు చర్చకు దారితీసింది. ఈ వీడియోలో భానుచందర్ పూర్తిగా తెల్లబడిన జుట్టు, గడ్డంతో 'సాల్ట్ అండ్ పెప్పర్' లుక్‌లో కనిపించారు. ఒకప్పుడు తెరపై కనిపించిన గ్లామరస్ లుక్‌తో పోలిస్తే ప్రస్తుతం ఆయనలో భారీ మార్పు కనిపించడంతో, కొందరు నెటిజన్లు "ఇతను భానుచందరా?" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయస్సు 73 ఏళ్లు కావడంతో సహజంగానే వచ్చిన ఈ మార్పు అభిమానులను షాక్‌కు గురిచేసింది. మేకప్ లేకుండా చాలా సాధారణంగా కనిపించడంతో ఈ వీడియో మరింత వైరల్ అయింది.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343